www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 18 ఏప్రిల్ 2024 8 పేజీలు





ప్రలోభాల వల

- గెలుపే లక్ష్యంగా పార్టీల ఎత్తులు
- ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలకు భారీగా ముడుపులు
- డబ్బు, మద్యం పంపిణీకి సన్నాహాలు



ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అభ్యర్థులు ఎత్తులు వేస్తున్నారు. ఇప్పటికే ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు శ్రమిస్తున్నారు. సామాజిక వర్గాల వారీగా సమీకరణలతో ముందుకు సాగుతున్నారు. ఆయా ప్రాంతాల్లో కులాల వారీగా ఉన్న ఓటర్ల జాబితాలను పరిశీలిస్తూ ఎవరు ఎటువైపు ఉన్నారనే అంశాలపై సమీక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారిని ఎలాగైనా ప్రలోభ పెట్టి తమ వైపు తిప్పుకునే ప్రయత్నాల్లో అభ్యర్థులు, వారి ముఖ్య అనుచరులు నిమగ్నమై ఉన్నారు. అవసరమైతే పెద్ద ఎత్తున డబ్బు పంచి మద్యాన్ని ఏరులై పారించేందుకు సైతం సన్నద్ధమవుతున్నారు.

జంపింగ్‌లపై దృష్టి

జిల్లాలో ప్రధాన రాజకీయ పార్టీలు ఆయా పార్టీల నుంచి వలసలు వచ్చేవారిపై ప్రధానంగా దృష్టిని సారించాయి. జనసేన, టిడిపి పట్ల అసంతృప్తితో రగిలిపోతున్న ముఖ్య అనుచరులు, నాయకులు, కార్యకర్తలను గుర్తిస్తూ వైసిపి పార్టీలోకి ఆహ్వానిస్తుంది. వీరిలో ముఖ్య నాయకులను పెద్ద ఎత్తున ప్రలోభాలకు గురి చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. భారీగా ప్యాకేజీలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నట్లుగా తెలుస్తోంది. కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, పెద్దాపురం, ప్రత్తిపాడు, తుని తదితర నియోజకవర్గాల్లో ఇటీవల కాలంలో జనసేన, టిడిపిల నుంచి వైసిపిలోకి చేరే వారి సంఖ్య పెరిగింది. అటు వైసిపి నుంచి టిడిపి, జనసేనలోకి చేరుతున్న వారు కూడా ఎక్కువగానే ఉన్నారు. కూటమి పార్టీలు సైతం పెద్ద ఎత్తున సొమ్ములు ఆశ చూపి అధికారం పార్టీ నుంచి జాయినింగ్స్ పేరుతో కండువాలు కప్పి ప్రచారం చేసుకుంటున్నారు. ప్రధానంగా పిఠాపురం నుంచి పవన్ కళ్యాణ్ పోటీ చేస్తున్న నేపథ్యంలో గెలుపే లక్ష్యంగా ఆ పార్టీ అగ్ర నేతలు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. అధికార పార్టీ నుంచి కాకినాడ ఎంపీ వంగా గీత గట్టి పోటీ ఇస్తుండడంతో పవన్‌కళ్యాణ్‌ను విజయం వరించేలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అధికార పార్టీలో తటస్థంగా ఉండిపోయిన అసంతృప్తులను గుర్తించి వారికి పెద్ద ఎత్తున ముడుపులు చెల్లించి పార్టీలోకి చేర్చుకుంటున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రస్తుతం నియోజకవర్గంలో చేర్పులపై నేతలు ఎక్కువగా దృష్టిని సారించారు. జనసేన కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఈ వ్యవహారంలో చక్రం తిప్పుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు అధికారపక్షం కూడా టిడిపి, జనసేన నాయకులను ప్రలోభాలకు గురి చేస్తున్నట్లుగా జోరుగా చర్చ జరుగుతుంది.

ప్రజాప్రతినిధులకు భారీగా ప్యాకేజీలు

తమ గెలుపులో ప్రధాన పాత్ర వహించే ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులకు వైసిపి అభ్యర్థులు భారీగా ప్యాకేజీలు ఇచ్చేందుకు సిద్ధపడుతున్నట్లుగా సమాచారం. అధికార పార్టీపై తీవ్ర వ్యతిరేకత ఉన్న నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు

2లో..



నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

ముహూర్తాలు ఖరారు చేసుకున్న అభ్యర్థులు

భారీ ఏర్పాట్లలో అనుచరులు, కార్యకర్తలు

22న పిఠాపురంలో నామినేషన్ వేయనున్న పవన్ కళ్యాణ్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ నేపథ్యంలో మరో కీలక ఘట్టం నేటి నుంచి ప్రారంభకానుంది. గురువారం ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుంది. కలెక్టర్ ఉదయం 10:30 గంటలకు కలెక్టరేట్లో నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. అనంతరం ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఆర్ఒ కార్యాలయంలో అధికారులు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. ఈనెల 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ఉంటుంది. 26న నామినేషన్ల పరిశీలన, 29 వరకు నామినేషన్లు ఉపసంహరణకు గడువు ఇచ్చారు. అనంతరం పోటీలో నిలిచిన అభ్యర్థుల జాబితాలను విడుదల చేస్తారు. ఆ తర్వాత బ్యాలెట్ పేపర్లు ముద్రిస్తారు.

13 రకాల డాక్యుమెంట్లు

నామినేషన్ల దాఖలకు 13 రకాల డాక్యుమెంట్లను సమర్పించాల్సి ఉంటుంది. అన్ని డాక్యుమెంట్లు సక్రమంగా ఉంటేనే నామినేషన్లను అనుమతిస్తారు. పార్లమెంటరీ నియోజకవర్గం కోసం ఫారం-2ఎ, అసెంబ్లీ నియోజకవర్గం కోసం ఫారం-2బి సమర్పించాలి. నోటిఫైడ్ తేదీల్లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు మాత్రమే నామినేషన్లను స్వీకరిస్తారు. ప్రభుత్వ సెలవు రోజుల్లో నామినేషన్ల స్వీకరణ ఉండదు.

గరిష్టంగా 4 సెట్ల నామినేషన్లు

ఒక అభ్యర్థి గరిష్టంగా 4 సెట్ల నామినేషన్లు దాఖలు చేసుకునే అవకాశం ఉంది. అలాగే ఒక అభ్యర్థి 2 కంటే ఎక్కువ నియోజక వర్గాల నుంచి నామినేషన్లు వేయడానికి వీలు లేదు. అభ్యర్థి నామినేషన్ వేసేటప్పుడు దరఖాస్తును పూర్తిగా పూరించారా లేదా సరి చూసుకోవాలి. దరఖాస్తులో అన్ని కాలమ్స్ పూర్తి చేశారా లేదో ఒకసారి పరిశీలించుకోవాల్సి ఉంటుంది. ఆఫిడవిట్‌లో ప్రతి పేజీ పైనా అభ్యర్థి విధిగా సంతకం చేయాల్సి ఉంటుంది. పార్లమెంట్ నియోజకవర్గ పోటీకి జనరల్ అభ్యర్థి సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.25 వేలు, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు కుల ధృవీకరణ పత్రం సమర్పిస్తూ రూ.12,500 సెక్యూరిటీ

2లో..



ముఖ్యమంత్రి పర్యటించే బస్సు

నేడు జిల్లాలో జగన్ బస్సు యాత్ర

ప్రజాశక్తి-కడియం

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర గురువారం తూర్పుగోదావరి జిల్లాలో సాగనుంది. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు కడియం మండలంలోకి ప్రవేశిస్తుంది. కడియపులంక, వేమగిరి జంక్షన్, బొమ్మూరు సెంటర్, హుకుంపేట, మోరంపూడి వరకూ రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో సాగుతుంది. అనంతరం మోరంపూడి నుంచి నగరంలో 22 వార్డుల మీదుగా ముఖ్యమంత్రి రోడ్ షో నిర్వహిస్తారు. అనంతరం బస్సు యాత్ర గామన్‌బ్రిడ్జి, దివాన్‌చెరువు మీదుగా రాజానగరంలో ప్రవేశిస్తుంది. రాత్రికి రాజానగరం మండలం ఎస్‌టి.రాజవరంలో జగన్ బస చేయనున్నారు. ఈ యాత్రకు సంబంధించి నాయకులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా బుధవారం తూర్పు గోదావరి జిల్లా బస్సు యాత్ర రోడ్ షోపై ట్రైల్ రన్ నిర్వహించారు.

కార్టూ'నిజం'



నిఘా బృందాలు సమిష్టిగా పని చేయాలి



సమీక్షా సమావేశంలో పాల్గొన్న అధికారులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు ఎంసిసి, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వైలెన్స్, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు అంకిత భావంతో సమిష్టిగా కృషి చేయాలని రిటర్నింగ్ అధికారి, రాజమండ్రి సిటీ అసెంబ్లీ నియోజకవర్గం ఆర్ఒ, నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ తెలిపారు. తనిఖీ బృందాలతో నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలూ, వారి అభ్యర్థులూ తమ కార్యకలాపాలను విస్తతం చేస్తారని, కావున మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సరియైన పత్రాలు లేకుండా ఎవరూ నగదు తీసుకెళ్ళరాదని, అటువంటి నగదు దొరికినపుడు నిబంధనలకు అనుగుణంగా ప్రవర్తించాలని చెప్పారు. రూ.10 లక్షల కన్నా ఎక్కువ మొత్తం దొరికితే ఆదాయపన్ను శాఖ వారికి సమాచారం ఇచ్చి, వారి ద్వారా నగదు జప్తు చేయాలని తెలిపారు. అభ్యర్థులతో ర్యాలీలో పాల్గొనే వారి వాహనాలను నిశితంగా పరిశీలించాలని, పార్టీ జండాలతో ఆయా వాహనాల ఖర్చు అభ్యర్థి ఖాతాలో వేయాల్సి ఉంటుందని తెలియచేసారు. స్టాటిక్ సర్వైలెన్సు టీములు నగరంలోకి ప్రవేశించే మార్గాలన్నింటి వద్ద నిఘా వేసి ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని ఆదేశించారు. రేపటి నుంచి అన్ని బందాలు పూర్తి స్థాయిలో పని చేయాలని, బందాల యొక్క పని తీరును రోజు వారీగా సమీక్ష చేస్తామన్నారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలో గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లు స్వీకరించేందుకు అనుగుణంగా పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు కలెక్టరేట్‌లో, అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులు ఆయా నియోజకవర్గాల ప్రధాన కేంద్రాల్లో నామినేషన్లు దాఖలు సేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

ఒక్కో అభ్యర్థి గరిష్ఠంగా నాలుగు సెట్లను దాఖలు చేయవచ్చని తెలిపారు. నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే ఆర్ఒ కార్యాలయం వరకు అనుమతి ఇస్తారని, ప్రతిపాదకుడు తప్పకుండా హాజరవ్వాలని తెలిపారు. మిగిలిన వారిని 100 మీటర్ల అవతల నిలిపివేస్తారన్నారు. అభ్యర్థితో మొత్తం మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. పోటీ చేసే అభ్యర్థులు పార్లమెంటుకు రూ.25,000, అసెంబ్లీకి రూ.10,000 ధరావతు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు దీనిలో 50 శాతం చెల్లిస్తే సరిపోతుందన్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటిస్తూ అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేయాల్సి ఉంటుందని ఆమె తెలిపారు. ఈ నామినేషన్ల ప్రక్రియను పూర్తిగా రికార్డు చేసేందుకు నామినేషన్లను స్వీకరించే గదిలో, అభ్యర్థులు ప్రవేశించే ద్వారాల వద్దా సిసి కెమెరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మోడల్ కోడ్ అమల్లో భాగంగా అభ్యర్థుల ఊరేగింపులను, నామినేషన్ దాఖలు చేసే కార్యక్రమాలను సైతం వీడియో రికార్డింగ్ చేస్తారన్నారు.

నియోజకవర్గాల వారీగా నామినేషన్లను స్వీకరించేందుకు పార్లమెంటు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కలెక్టర్ ఛాంబర్‌లో, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో రాజమండ్రి రూరల్ జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో, రాజమహేంద్రవరం అర్బన్ మున్సిపల్ కమిషనర్ ఛాంబర్‌లో, కొవ్వూరు సబ్ కలెక్టర్ ఛాంబర్‌లో, రాజానగరం, అనపర్తిల్లో ఎంపిడిఒ కార్యాలయంలో, నిడదవోలు గ్రామ కచేరీలో, గోపాలపురం తహశీల్దార్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు స్వీకరించేందుకు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఏప్రియల్ 21 ఆదివారం ప్రభుత్వ సెలవు రోజున నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఉండదని, నామినేషన్లకు చివరి తేదీ ఏప్రిల్ 25 అని తెలిపారు. ఉపసంహరణకు చివరి తేదీ ఏప్రిల్ 29 అని తెలిపారు.

19న కందుల దుర్గేష్ నామినేషన్

ప్రజాశక్తి-నిడదవోలు

ఈ నెల 19న నామినేషన్ దాఖలు చేయనున్నట్లు జనసేన పార్టీ నిడదవోలు అభ్యర్థి కందుల దుర్గేష్ తెలిపారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నామినేషన్‌కు పార్టీ కార్యాలయం నుంచి పాదయాత్రగా బయల్దేరి తహశీల్దారు ఆఫీస్ సమీపంలోని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు పవన్ కళ్యాణ్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున నాయకులంతా సమిష్టిగా పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు రంగ రమేష్, టిడిపి పట్టణ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రం ఏర్పాటు చేస్తున్న ప్రతినిధులు

గ్రామాల కూడలిలో చలివేంద్రం

ప్రజాశక్తి-తాళ్లపూడి

ఏ సమయంలోనైనా ప్రజల దాహార్తిని తీర్చాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరి పైనా ఉందని పలువురు వక్తలు అన్నారు. మండుతున్న ఎండలు, వేసవిని దృష్టిలో ఉంచుకుని మండలంలోని పెద్దేవం సినిమా హాల్ సెంటర్ వద్ద మూడు గ్రామాలను కలిపే కూడలిలో పలు సేవా సంస్థలు మంచినీటి చలివేంద్రాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సేవా సంస్థల ప్రతినిధులు మల్లిపూడి హనుమంతు, ఘనసాల ఆకాష్, కొనగల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి అబ్జర్వర్స్‌గా హమీద్, ఇబ్రహీం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

వైసిపి మైనారిటీ విభాగం అబ్జర్వర్స్‌గా పార్టీ ఆవిర్భావం నుంచీ సేవలందిస్తున్న ఎండి.హమీద్ బాషా, షేక్ ఇబ్రహీం బాషాలు నియమితులయ్యారు. రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్ ఆదేశాల మేరకు జిల్లా మైనారిటీ విభాగం అధ్యక్షుడు ఎండి.వజీరుద్దీన్ సూచనల మేరకు వీరిని నియమించారు. వీరిద్దరినీ గూడూరి శ్రీనివాస్ తనయుడు భారతి రామ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ నిజాం, జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు ఎండి.ఆరిఫ్, జిల్లా మైనారిటీ విభాగం ఉపాధ్యక్షుడు ఎండి.రమీజ్, ఎండి.షబ్బీర్ పాల్గొన్నారు.

ప్రలోభాల వల

(మొదటి పేజీ నుంచి)

తమ తమ ప్రాంతాల్లో ఎవరికి వారు ప్రచారం చేయలేకపోతున్నారు. పార్టీ అభ్యర్థి వచ్చినప్పుడు మాత్రమే ప్రచారంలో పాల్గొంటున్నారు. ఇలాగైతే గెలుపు కష్టమని భావిస్తున్న అభ్యర్థులు ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులను సంతృప్తి పరిచేందుకు ఒక్కొక్కరికి రూ.2 నుంచి రూ.3 లక్షలు వరకూ భారీ ప్యాకేజీ ఇచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇవి కాకుండా ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు పోలింగ్ బూత్ ల వారీగా ఒక్కొక్కరికి రూ.3 నుంచి 5 వేలు నగదు పంపిణీ చేసేందుకు సైతం సన్నద్ధమవుతున్నట్లుగా తెలుస్తోంది. గట్టి పోటీ ఉన్న నియోజకవర్గాల్లో రూ.5 నుంచి అవసరమైతే రూ.10 వేలు పంచేందుకు సిద్ధం అవుతున్నారన్న ప్రచారం జోరుగానే సాగుతోంది. ఈసారి ఎన్నికల సంఘం గట్టి నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయడంతో గుట్టు చప్పుడు కాకుండా ఓటర్లను పెద్ద ఎత్తున ప్రలోభాలకు గురి చేసే ప్రయత్నాల్లో ముఖ్యంగా వైసీపీ, ఆ తర్వాత కూటమి అభ్యర్థులు వున్నట్లుగా తెలుస్తోంది.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

(మొదటి పేజీ నుంచి)

డిపాజిట్ చెల్లించాలి. అసెంబ్లీ నియోజకవర్గ పోటీకి జనరల్ అభ్యర్థి రూ.10 వేలు, ఎస్‌సి, ఎస్‌టిలు రూ.5వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. అభ్యర్థి ఎన్నికల వ్యయ పరిశీలన కోసం నూతనంగా ఏదైనా బ్యాంకు, కో-ఆపరేటివ్ బ్యాంకు, పోస్టాఫీసులో తెరిచిన ప్రత్యేక బ్యాంక్ ఖాతా వివరాలు సమర్పించాల్సి ఉంటుంది. నామినేషన్ల దాఖలు చేసేప్పుడు అభ్యర్థితో కలిపి గరిష్ఠంగా ఐదుగురిని మాత్రమే ఆర్ఒ కార్యాలయంలోకి అనుమతిస్తారు.

ముహూర్తాలు ఖరారు

ఈనెల 22న జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిఠాపురంలో నామినేషన్ దాఖలు చేయనున్నారని ఆ పార్టీ శ్రేణులు తెలిపారు. పిఠాపురం ఎంపిడిఒ కార్యాలయంలో స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. చేబ్రోలులోని తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఆయన నివాసం వద్ద నుంచి పవన్ కళ్యాణ్ భారీ ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి సుమారు 50వేల మంది కార్యకర్తలను సమీకరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అలాగే కాకినాడ పార్లమెంటు వైసిపి అభ్యర్థి చలమలశెట్టి సునీల్ కూడా నామినేషన్ దాఖలకు ముహూర్తాన్ని ఖరారు చేసుకున్నారు. ఈ నెల 25న ఆయన భారీ ర్యాలీగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో నామినేషన్ వేయనున్నారు. జనసేన నుంచి పార్లమెంటు కూటమి అభ్యర్థి తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్ 23న నామినేషన్ వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈనెల 19న కాకినాడ రూరల్ జనసేన అభ్యర్థి పంతం నానాజీ, జగ్గంపేట టిడిపి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ, కాకినాడ సిటీ టిడిపి అభ్యర్థి వనమాడి కొండబాబు, ప్రత్తిపాడు వైసిపి అభ్యర్థి వరుపుల సుబ్బారావు నామినేషన్ పత్రాలను దాఖలు చేయనున్నారు. 21న తుని ఎంఎల్‌ఎ మంత్రి దాడిశెట్టి రాజా, 22న తుని కూటమి అభ్యర్థి యనమల దివ్య, పెద్దాపురం టిడిపి అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప, వైసిపి నుంచి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, పిఠాపురం వైసీపీ అభ్యర్థి వంగా గీత, 23న జగ్గంపేట వైసిపి అభ్యర్థి తోట నరసింహం, ప్రత్తిపాడు టిడిపి అభ్యర్థి వరుపుల సత్య ప్రభ, 25న పెద్దాపురం వైసిపి అభ్యర్థి దవులూరి దొరబాబు నామినేషన్ వేయనున్నారు. ఇదే రోజున కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి వైసిపి నుంచి నామినేషన్ దాఖలు చేయనున్నారని ఆయన అనుచరులు తెలిపారు. నామినేషన్ వేసే రోజున పెద్ద ఎత్తున అనుచరులు, కార్యకర్తలను సమీకరించి ర్యాలీలు నిర్వహించేందుకు ఆయా పార్టీల అభ్యర్థులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

వెంకటరమణకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - సీతానగరం

టిడిపి రాజానగరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణ చౌదరి న్యూజిలాండ్ నుంచి తిరిగి వచ్చిన నేపథ్యంలో టిడిపి శ్రేణులు రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్ట్‌లో ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. వెంకటరమణ చౌదరికి స్వాగతం పలికిన వారిలో ఉండవల్లి వృథ్వీ, పిన్నన మణికంఠ, యలమాటి నారాయణ, యనమదల నాగదీప్, ఉండవల్లి సత్యనారాయణ, కాంద్రు విశ్వనాథం ఉన్నారు.

రూ.7 లక్షలతో రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి-గోకవరం

రోడ్డు సౌకర్యం లేక పలు ఇబ్బందులు పడుతున్న కుమ్మరపేట ప్రజలకు వైసిపి జగ్గంపేట నియోజకవర్గం ఇన్‌ఛార్జి, మాజీ మంత్రి తోట నరసింహం ఆదేశాల మేరకు చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణం పూర్తయ్యిందని ఎంపిపి సుంకర శ్రీవల్లి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిషత్ నిధుల నుండి రూ.7 లక్షల నిధులు ఈ నిర్మాణానికి కేటాయించినట్లు తెలిపారు. కుమ్మరి పేట వీధిలో ఎన్నికల కోడ్ రాకమునుపే రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, కనీస రోడ్డు సౌకర్యం లేకపోవడం చాలా బాధాకరమైన విషయం అన్నారు. తోట నరసింహం ఆదేశాల మేరకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. తప్పనిసరిగా గోకవరం గ్రామ ప్రజలకు ఏ సందర్భంలో అయినా అందుబాటులో ఉంటూ మౌలిక వసతులు కల్పన ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు.

జోరుగా అభ్యర్థుల ఎన్నికల ప్రచారం

పలువురు అభ్యర్థులు ఆయా నియోజకవర్గాల్లో బుధవారం జోరుగా ప్రచారం చేశారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

సీతానగరం పేదవారి జీవితాల్లో వెలుగులు నింపిన సంక్షేమ ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా సతీమణి జక్కంపూడి రాజశ్రీ ప్రజలను కోరారు. మిర్తిపాడు గ్రామంలో బుధవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వైసిపికి ఓటు వేయాలని అభ్యర్థించారు. మిర్తిపాడు గ్రామంలో మౌలిక వసతులు కల్పనకు అధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. గతప్రభుత్వ హయాంలో కనీసం పది శాతం కూడా అభివృద్ధికి నిధులు మంజూరు కాలేదన్నారు. ఐదేళ్లలోనే వైసిపి ప్రభుత్వంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ వంటి శాశ్వత భవనాల ఏర్పాటుతో గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉండేలా సిఎం వైఎస్.జగన్ చేశారన్నారు.

పెరవలి మండలం కాకరపర్రులో బిఎస్‌పి అభ్యర్థి గుమ్మపు చిత్రసేన్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాల మాటున ప్రజల ధనాన్ని, సహజ సంపదలను దోపిడీ చేసిందన్నారు. రాష్ట్ర ప్రజలు పన్నులు రూపంలో కట్టిన డబ్బులను ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికి ప్రయత్నం చేయకపోగా, తమ కనీస అవసరాల కోసం ప్రజలు ఎప్పుడూ ప్రభుత్వాల వైపే చూసేలాగా చేసి ప్రభుత్వం సహజ వనరులైన ఇసుక, మట్టి, గనులను తమ అనుకూలురకు దోచి పెడుతున్నారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేసే ప్రయత్నాలను అడ్డుకుని లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ప్రభుత్వరంగ సంస్థను కాపాడడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి ప్రయత్నం చేయడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నల్లి రమేష్, బత్తిన ఆశీర్వాదం, కప్పల ఇశ్రాయిల్, గుమ్మాపు వాసు, చల్లాబత్తుల సత్యనారాయణ, చిన్నం వెంకటేశ్వర రావు, మోర్త చింతరాజు, పాండురంగ తదితరులు పాల్గొన్నారు.



గోకవరంలో జ్యోతుల నెహ్రూ ప్రచారం

నిడదవోలు పట్టణంలోని 16 వార్డులో ఎంఎల్‌ఎ శ్రీనివాస్ నాయుడు తనయుడు వరుణ్ సాయి పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం సాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరోసారి అవకాశం ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థించారు. మరోసారి గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యలగడ బాలరాజు, మున్సిపల్ కౌన్సిలర్లు గోపిరెడ్డి శ్రీను, దాకే అనిల్ కుమార్, పడాల శిరీష, తదితరులు పాల్గొన్నారు.

గోకవరం మండలంలోని వెదురుపాక, బావాజీపేట, గుమ్మళ్లదొడ్డిలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ బుధవారం రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ విద్య, వైద్యం, ఉపాధి, సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధే ఎజెండాగా పని చేస్తామన్నారు. నియోజకవర్గ కేంద్రంలో భావితరాల భవిష్యత్తు కోసం పెద్ద విద్యాలయాన్ని తీసుకు వస్తామన్నారు. ఇంజనీరింగ్, పారా మెడికల్, బిఎస్‌సి నర్సింగ్, ఐటిఐ, వృత్తి కోర్సులతో విద్యను ఉచితంగా అందిస్తామన్నారు. అందరికీ వైద్యాన్ని అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. మండలానికి కుటీర పరిశ్రమలు తీసుకువచ్చి మహిళలకు, నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామన్నారు. అసెంబ్లీకి సైకిల్ గుర్తుకు, పార్లమెంట్‌కు గ్లాస్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్, బిజెపి జిల్లా కార్యదర్శి మట్టా మంగరాజు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరం సిపిఐ ఎంఎల్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు పలివెల వీరబాబు మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజల కోసమే పనిచేసే తనను ఎంఎల్‌ఎగా గెలిపించాలని ఆయన కోరారు. ఐదేళ్లకు ఒకసారి కనపడే నాయకుని నమ్మవద్దని చెప్పారు.

క్రైం వార్తలు

వృద్ధురాలి మెడలో పుస్తెలతాడు చోరీ

ప్రజాశక్తి - సామర్లకోట

ఇప్పటివరకు రోడ్లపై నడుస్తున్న మహిళల మెడలో బంగారు పుస్తెలతాడులు, గొలుసులను మోటార్ సైకిల్‌పై చాకచక్యంగా చైన్ స్నాచర్లు తెంపుకుపోతున్నారు. ప్రస్తుతం ఇంటిలో ఉన్న వారి మెడల్లో ఉన్న పుస్తెలతాడులను సైతం తంపుకుని పోతున్నారు. బుధవారం సామర్లకోట సత్యనారాయణపురంలో ఒక ఇంట్లోకి చొరబడి వృద్ధిరాలి మెడలో పుస్తెలతాడును తెంపుకుపోయిన సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్యనారాయణపురంలో నాగం సత్యవతి బుధవారం ఉదయం 11 గంటల సమయంలో ఇంట్లో బట్టలు మార్చుకుంటుండగా గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడి ఆమె మెడలో బంగారు పుస్తెలతాడును తెంపుకుని పరారయ్యాడు. ఈ సంఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలాన్ని సామర్లకోట మహిళా ఎస్ఐ వి.మౌనిక పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని సూరంపాలెం ఎడిబి రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...జగ్గంపేట గ్రామానికి చెందిన అలపాటి రాజేష్ మోటార్ సైకిల్‌పై మంగళవారం రాత్రి 9:30 గంటలకు పెద్దాపురం నుంచి రామేశ్వరంపేట వస్తుండగా రాజానగరం వైపు నుంచి పెద్దాపురం వైపు వస్తున్న బొలేరా వ్యాన్ అతివేగంగా వచ్చి ద్విచక్రవాహనదారుడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు తల్లి రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్ రామకృష్ణ తెలిపారు.

వైసిపికి కొటారు అశోక్ రాజీనామా

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

పార్టీలో అంతర్గత విభేదాలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోక పోవడంతో మనస్తాపం చెంది వైసిపికి, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా చేసినట్టు కొటారు అశోక్ బాబా తెలిపారు. కొవ్వూరు ప్రెస్ క్లబ్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లలో నియోజవర్గ పరిధిలో అభివృద్ధి చేయలేక పోయామని కమ్మ కార్పొరేషన్ ద్వారా రూ.ఒక రూపాయి నిధులు కేటాయించి కార్యకర్తలకు ఎటువంటి సహాయం చేయాలేదని బాధ తనలో మిగిలిందన్నారు. 30 ఏళ్లుగా తమ కుటుంబం రాజకీయాల్లో ఉన్నప్పటికీ గతంలో జెడ్‌పిటిసిగా పోటీ చేసి ఓడిపోయినట్టు తెలిపారు. అయినప్పటికీ 2019లో తానేటి వనిత గెలుపు కోసం కృషి చేశామని తెలిపారు. పార్టీలో వ్యక్తిగత విమర్శలకు దిగజారటంతో మనసు చలించిపోయి పార్టీ సభ్యత్వానికి, పదవికి రాజీనామా చేయవలసి వచ్చిందని చెప్పారు. భవిష్యత్తు కార్యాచరణ నియోజకవర్గ ప్రజలు, చాగల్లు మండల కార్యకర్తలు, నాయకులతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఆయనతో పాటు జిల్లా వ్యవసాయ సలహామండలి పదవికి మల్లవరం గ్రామానికి చెందిన లకంసాని శ్రీనివాససరావు కూడా రాజీనామా చేశారు.

నేడు శ్రీనివాస్‌నాయుడు నామినేషన్

పెరవలి : వైసిపి నిడదవోలు అభ్యర్థి జి. శ్రీనివాస్ నాయుడు గురువారం ఉదయం 9 గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్నట్టు ఆ పార్టీ నాయకులు తెలిపారు. నిడదవోలు తహశీల్దారు కార్యాలయానికి భారీ ర్యాలీగా తరలి వెళ్లి నామినేషన్ దాఖలు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ నాయకులు, కార్యకర్తలు అభిమానులు భారీగా పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

నేటి నుంచి నామినేషన్లు ప్రారంభం

కొవ్వూరు రూరల్ : కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికలకు సంబంధించి ఎన్నికల అధికారి అశుతోష్ శ్రీవాత్సవ నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. వైసిపి అభ్యర్థి తలారి వెంకట్రావు 18వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు నామినేషన్ దాఖలు చేస్తారని, 19వ తేదీ ఉదయం 11 గంటలకు టిడిపి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు నామినేషన్ దాఖలు చేస్తారని, అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అరిగెల అరుణకుమారి నామినేషన్ వేస్తారని ఆయా పార్టీల వర్గాలు తెలిపాయి.

ప్రమాదంలో నలుగురికి గాయాలు

సామర్లకోట : సామర్లకోట- పెద్దాపురం రోడ్డులోని ప్రసన్నఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో వైఆర్ఎల్ హైస్కూల్ వద్ద విద్యుత్ స్తంబాన్ని కారు ఢీ కొట్టిన ప్రమాదంలో కారులో ప్రయానిస్తున్న నలుగురు ప్రయాణీకులకు స్వల్ప గాయ్యాలయ్యాయి. బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో సామర్లకోట ప్రసన్న ఆంజనేయ నగర్ మీదుగా పెద్దాపురం రోడ్డు వైపు వెళుతున్న కారు రోడ్డు మార్జిన్‌లో ఉన్న 11 కెవి విద్యుత్ స్తంబాన్ని బలంగా ఢీ కొట్టింది. దానితో స్తంభం విరిగి కారుపై పడగా కారులో ప్రయానిస్తున్న నలుగురికి స్వల్ప గాయలపాలయ్యారు. ప్రమాదం స్థలంలో కారు, కూలిన స్తంభం రాత్రి 7 గంటల వరకూ అలాగే ఉండి పోవడంతో ఆ రోడ్డులో వాహనాల రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు తప్పలేదు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

యు.కొత్తపల్లి : కొత్తపల్లి పంచాయతీ రవీంద్రపురంలో వివాహిత అనుమానస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. రవీంద్రపురానికి చెందిన కోట అనిల్‌తో రాజోలుకి చెందిన కొండ అనూష (29)కు వివాహం జరిగింది. వీరికి 4 ఏళ్ల బాబు ఉన్నాడు. బుధవారం భర్త, ఆడపడుచు కాకినాడ ఆసుపత్రికి వెళ్లారు. ఆ సమయంలో అనూష భర్తకు రెండు దఫాలు ఫోను చేసింది. ఇంతలో అనిల్ తండ్రి ఇంటికి వచ్చి తలుపు కొట్టిరనా స్పందించక పోవడంతో దగ్గర్లో ఉన్న ఒకరిని పిలిచి తలుపు తీయించగా ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే ఈ సంఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. ఎస్ఐ స్వామి నాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

బిల్డింగ్ పైనుంచి పడి కార్మికుడు మృతి

గోపాలపురం : ప్రమాదవశాత్తు బిల్డింగ్ పైనుంచి పడి భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని భీమోలు గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. మృతుని బంధువులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గోపాలపురం గ్రామానికి చెందిన షేక్ యాసీన్ (35) భవన నిర్మాణ పనులు చేస్తుంటాడు. భీమోలు గ్రామానికి చెందిన సుభానీ బిల్డింగ్ రెండో అతస్తు నిర్మాణ పనులు చేపట్టే క్రమంలో రెండో అంతస్తు నుండి ప్రమాదవశాత్తు కింద పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంలో యాసిన్‌ను గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. పనికి వెళ్లిన కొడుకు మృతి చెందడంతో వద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు బోరున విలపించారు.

డ్రెయిన్‌లో పడిన వ్యాన్

ప్రజాశక్తి-గోపాలపురం

అదుపుతప్పి ఐసర్ వ్యాన్ డ్రైన్ కల్వర్టులో పడిపోయిన సంఘటన గోపాలపురం శివారు కనకదుర్గమ్మ గుడి సమీపంలో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బుధవారం స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ కరీంనగర్ నుంచి తవుడు లోడుతో ఐసర్ వ్యాన్ కత్తిపూడి సరుకు దింపేందుకు వెళుతోంది. ఈ క్రమంలో గోపాలపురం శివారు కనకదుర్గమ్మ గుడి సమీపంలోకి వచ్చేసరికి హైవే రోడ్డును ఆనుకుని ఉన్న డ్రైన్ కల్వర్టులో బుధవారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో వ్యాన్ అదుపుతప్పి ఒక్కసారిగా పడిపోయింది. ఈ ప్రమాదం డ్రైవర్ నిద్రమత్తులో జరిగిందో లేక వాహనాన్ని తప్పించబోయి ఈ ప్రమాదం జరిగిందో గాని డ్రైవర్ సురక్షితంగా చిన్నపాటి గాయాలతో బయటపడ్డాడని తెలిపారు. హైవే రోడ్డును ఆనుకుని ఉన్న ఇళ్లల్లో వారు నిద్రపోతున్నారని కల్వర్టు గోతిలో పడి ఉండకపోతే ఇళ్లల్లోకి దూసుకుని వెళ్లి పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ఎన్నికల ప్రచారం

30 మంది యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరిక

ప్రజాశక్తి -కాట్రేనికోన

ముమ్మిడివరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాలేపు ధర్మారావు ఇంటింటా ప్రచారంలో భాగంగా పల్లంకూర్రు, మిలటరీపేటలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు అయితాబత్తుల పండు బాబు ఆధ్వర్యంలో 30 మంది యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరందరికీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ పట్ల ఆకర్షితులై కాంగ్రెస్ పథకాలు నచ్చి పార్టీలో చేరమన్నారు. ఈ దేశానికి దిశా నిర్దేశం కాంగ్రెస్ వల్ల సాధ్యమని యువకులు అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ప్రజలు బ్రమరథం పట్టారు. ప్రతి గడప గడపకూ వెళ్లి గత పది సంవత్సరాల క్రితం కాంగ్రెస్ చేసిన అభివృద్ధి తప్ప ఈ ప్రభుత్వాలు ఏమీ చేయలేదన్నారు. ఈ రాష్ట్రానికి సరైన రాజధాని మరియు ప్రత్యేక హెూదా, పోలవరం ప్రాజెక్ట్ తదితరాంశాలపై ఎప్పుడూ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ఈ ప్రభుత్వానికి ఇంటింటికి వచ్చి ఓటు అడిగే నైతిక హక్కు లేదని ధర్మారావు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు రుణమాఫీ, ప్రత్యేక హోదా పది సంవత్సరాల గ్యారెంటీ, ఇల్లు లేని వారికి రూ.25 లక్షలతో ఇల్లు, ఉచిత విద్య కేజీ టు పీజీ, వద్ధులకు రూ.4000 పెన్షన్, వితంతువులకు రూ.6000, ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.400 వేతనం, కేంద్రంలో అధికారం వచ్చిన మొదటి సంవత్సరంలోనే 30 లక్షల ఉద్యోగాలు, రైతు పెట్టుబడి మీద 50 శాతం లాభంతో మద్దతు ధర, ప్రతి పేద కుటుంబంలో ఒక మహిళకు ప్రతి నెల రూ.8333 చొప్పున సంవత్సరానికి రూ.లక్ష, ప్రతి మహిళకు మహాలక్ష్మి పథకం కింద కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దివి వెంకన్న బాబు, ఐ పోలవరం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెయ్యాల చంటిబాబు, చెల్లూరి బాలకష్ణ, మల్లాడి గోపి, పాలెపు సత్తిరాజు, పాలపు శ్రీనురాజు తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కాట్రేనికోన మండలం పరిధిలోని మిలిటరీ పేటలో కాంగ్రెస్ పార్టీలో చేరిన యువత

అభ్యర్థుల కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్న రామచంద్రపురం నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు చేశామని రామచంద్రపురం ఎన్నికల అధికారి, ఆర్‌డిఒ సుధా సాగర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేసి వారికి అవసరమైన సమాచారం అందిస్తామని ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థికి నామినేషన్ పత్రాలు రెవెన్యూ డివిజినల్ అధికారి (రామచంద్రపురం) కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో దాఖలు చేసేందుకు కావలసిన సమాచారాన్ని అందిస్తామన్నారు. ఈనెల 18 గురువారం ఎన్నికల షెడ్యూల్ నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. అదే రోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ పత్రాలు స్వీకరణ ఉంటుందని పేర్కొన్నారు. పత్రాల స్వీకరణకు 18 గురువారం ప్రారంభం కాగా చివరి తేదీ 25వ తేదీ గురువారం అని తెలిపారు. దాఖలు చేసిన నామినేషన్ పరిశీలన ఈనెల 26వ తేదీ శుక్రవారం చేస్తామన్నారు. నామినేషన్ ఉపసహరించుకునేందుకు ఈ నెల 29వ తేదీ చివరి తేదీగా పేర్కొన్నారు. మే 13 సోమవారం పోలింగ్ నిర్వహిస్తామన్నారు. ఓట్ల లెక్కింపు జూన్ 4 మంగళవారం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఎన్నికల ప్రక్రియ ముగింపు జూన్ 6 గురువారంతో ముగుస్తుందని. 21వ తేదీ ఆదివారం ప్రభుత్వ సెలవుదినం నామినేషన్లు స్వీకరించమని తెలిపారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వంద మీటర్ల దూరం వరకు ఆంక్షలు విధిస్తున్నట్లు చెప్పారు. కేవలం మూడు వాహనాలకు మాత్రమే అనుమతి వుంటుందన్నారు. వివరాలకు రెవెన్యూ డివిజినల్ అధికారికార్యాలయం లోని హెల్ప్ డెస్క్ ఫోన్ నెంబర్ 08857-245166 ద్వారా సంప్రదించాలని రాజకీయ పక్షాలకు విజ్ఞప్తి చేశారు.

హేతువాది పేరలింగం మృతి తీరని లోటు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

హేతువాది, రచయిత దేవగుప్తాపు పేరలింగం మృతి హేతువాద సమాజానికి తీరని లోటు అని ఉమ్మడి ఉబయ గోదావరి జిల్లాల హేతువాద సంఘం కన్వీనర్ కెవివి.సత్యనారాయణ పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బుద్ధ పార్కు అవరణ లో బుధవారం ప్రజ్ఞా సాహితీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పుల్లేపు వెంకటేశ్వరరావు అధ్యక్షతన పేరిలింగం సంతాప సభ నిర్వహించారు. ఈ సభలో కెవివి.సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని తొలుత గౌతమ బుద్ధుడు, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పేరి లింగం మృతికి 2 నిమిషాలు మౌనం పాటించారు. పేరిలింగం చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పేరిలింగం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పామర్రు స్వగ్రామంమని, ఆయన ప్రాథమిక విద్య వరకు చదువుకుని కార్పెంటర్ గా పని చేస్తూ రాజమహేంద్రవరంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారని అన్నారు. 1982 నుంచి తువాదాన్ని ప్రచారం చేయడమే కాకుండా సుమారు 12 హేతువాద పుస్తకాలను రచించి పేరి లింగం మతి మానవ సమాజానికి తీరని లోటు అన్నారు. ఆధునిక కాలంలో ఎలక్ట్రానిక్ మీడియాలో నిత్యం ప్రచార మౌతున్న మనువాద ప్రచారాన్ని తిప్పి కొట్టేందుకు హేతువాద సంఘాలు దీటుగా పని చేయాలని పలువురు అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వడ్డీ నాగేశ్వరరావు, ఎంవి.సూర్జం, డి.ఆంజనేయులు, మోర్త రాజశేఖర్, బుడితి నాగేశ్వర రావు, విత్తనాల వరప్రసాదరావు, డి.రాజశేఖర్, ఎం.కొండబాబు తదితరులు పాల్గొన్నారు.



పేరలింగం చిత్రపటం వద్ద పలువురి నివాళి

పట్టణంలో 'బాబు ష్యూరిటీ'

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణంలో రాజీవ్ గృహకల్పలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో బుధవారం నిర్వహించారు. మాజీ మున్సిపల్ ఛైర్ పర్సన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, పట్టణ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు టిడిపి శ్రేణులతో కలసి ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావు ఇంటింటా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసమర్ధ వైసిపి పాలనకు ప్రజలు చమర గీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వం ఏర్పడాలని ఓటర్లకు తెలియజేశారు. ప్రస్తుత ఈ అసమర్ధ వైసిపి ప్రభుత్వం సంపద సష్టించలేకపోయిందని విమర్శించారు. సానుభూతి కోసం జగన్ ఎన్ని వేషాలు వేసినా నమ్మే స్థితిలో ఎవరూ లేరని దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల్లో తన డ్రామాలతో, సానుభూతితో ఓట్లు పొందాలనే సిఎం జగన్ ఆలోచనలకు ప్రజలు అంతే స్థాయిలో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి ఎంఎల్‌ఎ గా తనను, ఎంపీగా గంటి హరీష్ మాథూర్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్‌ఎ వేగుళ్ల

నామినేషన్ల ప్రక్రియకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి-కాకినాడ

నామినేషన్ల ప్రక్రియ కోసం సర్వం సిద్ధం చేశామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18వ తేదీన ఎన్ని కల గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తారని అన్నారు. జిల్లాలోని పార్లమెంట్ నియోజ కవర్గం, 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 18వ తేదీ నుంచి నామి నేషన్లను స్వీకరిస్తారన్నారు. నామినేషన్ల దాఖలకు చివరి తేదీ 25వ తేదీ అని, 26న నామినేషన్లను పరిశీలిస్తారని, నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ 29వ తేదీ అన్నారు. నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టామన్నారు. తుని నియోజకవర్గానికి సంబంధించి తునిలోని తహశీల్దార్ కార్యాలయంలో, ప్రత్తిపాడు నియోజ కవర్గానికి సంబంధించి ప్రత్తిపాడు తహ శీల్దార్ కార్యాలయంలో, పిఠాపురం నియోజ కవర్గానికి సంబంధించి పిఠాపురంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో, కాకినాడ రూరల్ నియోజకవర్గానికి సంబంధించి తహశీల్దార్ కార్యాలయంలో, పెద్దాపురం నియోజకవర్గానికి సంబంధించి ఆర్‌డిఒ కార్యాలయంలో, కాకినాడ స్మార్ట్ సిటీ నియోజకవర్గానికి సంబంధించి నగర పాలక సంస్థ కార్యాలయంలో, జగ్గంపేట నియోజకవర్గం సంబంధించి తహశీల్దార్ కార్యాలయంలో నామినేషన్‌లు స్వీకరిస్తారని కలెక్టర్ తెలిపారు. పార్లమెంట్ నియోజ కవర్గానికి సంబంధించి నామినే షన్లు కాకినాడ జిల్లా కలెక్టరేట్ వద్ద స్వీకరిస్తారన్నారు. నామినేషన్ ప్రక్రియ కోసం నామినేషన్ పేపర్స్ ఇష్యూ కౌంటర్, నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులకు అన్ని అంశాలను వివరిస్తారన్నారు.

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని అంకంపాలెం గ్రామానికి చెందిన పలు కుటుంబాలు బుధవారం వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. వీరికి కొత్తపేట నియోజకవర్గ టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఎంఎల్‌ఎ అభ్యర్థి బండారు సత్యానందరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని విమర్శించారు. వైసిపి పాలన తో ప్రజలు విసిగి వేశారి పోయారని అన్నారు. వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. టిడిపిలో చేరిన వారంతా త్వరలో జరగనున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి అభ్యర్థి విజయానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కుదుప కృష్ణమూర్తి,కరుటూరి రవి, రామదాసు రాంబాబు, నాయుడు హరీష్ నాయుడు శ్రీనివాస్, తోట కళ్యాణచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణ పరిధిలో పలుచోట్ల విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.విజయ్ ఆనంద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గొల్లపుంత, టిడ్కో గహ సముదాయ ప్రాంతం, రావులపేట, కష్ణకల్యాణి నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుతామని వెల్లడించారు. కాగా పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

బిఎస్‌పి అభ్యర్థి భీమారావు ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-ముమ్మిడివరం

మండలంలోని కొమానపల్లి పంచాయతీ పరిధిలోని పెద్దపేట అంబేద్కర్ నగర్‌ల్లో ముమ్మిడివరం నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి వాకపల్లి భీమారావు బుధవారం ఇంటింటికీ వెళ్ళి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల రాజ్యాధికారం కల సాకారం కావాలంటే బిఎస్ పి అభ్యర్థులను గెలిపించాలన్నారు. పాధి హామీ పథకం పని కూలీలను కలిసి ఏను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. అమలాపురం పార్లమెంటరీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న యాళ్ల దొరబాబు కు అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు రెండు ఓట్లు ఏనుగు గుర్తుకు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తూ కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమంలో బడుగు భీమేశ్వరరావు, కుసుమ శ్రీనివాస్ మరియు బిఎస్‌పి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సుభాష్

ఉట్రుమిల్లిలో సుభాష్ ప్రచారం

ప్రజాశక్తి-రామచంద్రపురం

నియోజకవర్గంలోని ఉట్రు మిల్లి గ్రామంలో టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి తనకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంరం టిడిపి ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

తడారుతున్న తాండవ

-ఎండిపోయిన ప్రధాన కాలువ
-నీటి ఎద్దడితో విలవిలలాడుతున్న మూగజీవాలు



ఎడారిగా మారిన తాండవ రిజర్వాయర్ ఏటి కాలువ

ప్రజాశక్తి - కోటనందూరు

తాండవ రిజర్వాయర్‌లో నీటిని నిల్వలు ఘనణీయంగా తగ్గిపోయాయి. దీంతో తాండవ రిజర్వాయర్ ప్రధాన ఏటి కాలువ ఎండిపోయింది. దీంతో నీటి ఎద్దడితో మూగజీవాలు విలవిలలాడుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా తాండవ రిజర్వాయర్‌లో నీటి నిలువలు తగ్గిపోయాయి. రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 380 అడుగులు కాగా ప్రస్తుతం 355.6 అడుగులు మాత్రమే ఉందనితాండవ రిజర్వాయర్ డిఇ పి.అనురాధ తెలిపారు. గత నాలుగు నెలల కాలం నుంచి వర్షాలు కురవకపోవడం, ఈ ఏడాది ఎండలు తీవ్రంగా ఉండటంతో జలాశయంలో నీటి నిల్వలు తగ్గిపోయాయని తెలిపారు. తాండవ రిజర్వేయర్ ఆనుకుని ఉన్న ప్రధాన ఏటి కాలువ ద్వారా నీటి ప్రవాహం ఉండేదని, ఈ ఏడాది ఆ పరిస్థితి లేకపోవడం వల్ల ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలో నీటి ప్రవాహం ఉండటంతో పశువులను మోపేందుకు ఆ చుట్టుపక్కలకే రైతులు తొలుకెళ్లేవారు. అయితే ప్రస్తుతం కాలువలో నీటి ప్రవాహం లేకపోవడంతో పశువులకు తాగునీరు లేక ఇబ్బందుల తప్పడం లేదని రైతులు సూరిబాబు నాగరాజు, ఎర్రపాత్రుడు వాపోయారు. కాలువ ఎండిపోవడంతో పశుగ్రాసం కూడా లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పశువులను దృష్టిలో పెట్టుకుని సంబంధిత శాఖ అధికారులు కాలువలోకి నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న యువకులు

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక 8వ వార్డులోని అగ్నికుల క్షత్రియ వీధిలో బుధవారం అగ్నికుల క్షత్రియ యూత్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎండల వేడిమి అధికంగా ఉండడంతో బాటసారులు అధిక సంఖ్యలో విచ్చేసి మజ్జిగ సేవించారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు పోతాబత్తుల శీను, దోమా షాలెం, పెమ్మాడి రాజేష్, బొమ్మిడి శివ, కామాడి బుజ్జి, మారాడి నాగు, వల్లపూడి యాకోబా, వనమాడి సూరిబాబు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా సాధ్యం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి నీరుకొండ సత్యనారాయణ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని మర్రివీడు, జె.అన్నవరం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి మే 13న జరిగే పోలింగ్‌లో కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావడం ద్వారానే యువతకు ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రానికి ప్రత్యేక హోదాను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షుడు మొయ్యేటి సూర్యప్రకాశరావు, నాయకులు కె.కోటేశ్వరరావు, కరణం శ్రీను, మహిళా నాయకురాలు కుమారి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సత్యనారాయణ



చెత్త పోగులు తొలగిస్తున్న సిబ్బంది

చెత్త కుప్పలు తొలగింపు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక తలుపులమ్మ కాలనీలో గత కొన్ని రోజులుగా పేరుకుపోయిన చెత్త పోగులను బుధవారం మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదు రాజు ఆదేశాల మేరకు సానిటరీ మేస్త్రి సూరిబాబు ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బంది తొలగించారు. 'పారిశుధ్య లోపం' శీర్షికన ఈ నెల 17న ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు స్పందించి సానిటరీ ఇనస్పెక్టర్ దావీదు రాజు వెంటనే ఈ చెత్త పోగులు తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

ప్రజాశక్తి - పెద్దాపురం



పెద్దాపురం అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్ఒ జె.సీతారామారావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 25 తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. 26న నామినేషన్ల పరిశీలన అనంతరం 29 వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉందన్నారు. పోలింగ్ సిబ్బందికి ఇవిఎంలు, వివి ప్యాట్‌లు, స్టేషనరీ, ఇతర పోలింగ్ సామాగ్రిని 12వ తేదీన అందజేస్తామని చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని 200 పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా పోలింగ్ జరిగేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.



పూజలు చేస్తున్న జ్యోతుల నెహ్రూ

19న జ్యోతుల నామినేషన్ దాఖలు

ప్రజాశక్తి - జగ్గంపేట

టిడిపి జగ్గంపేట నియోజకవర్గ అభ్యర్థి జ్యోతుల నెహ్రూ ఈ నెల 19న నామినేషన్‌ను దాఖలు చేయనున్నారు. బుధవారం మండలంలోని ఇర్రీపాక గ్రామంలో ఆయన శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల ఆశీర్వాదం నిమిత్తం నామినేషన్, ముహూర్త పత్రాలను పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 19వ తేదీ ఉదయం 10:30కు బయలుదేరి వెళ్లి 11.19 గంటలకు నామినేషన్ వేయడం జరుగుతుందని తెలిపారు. కావున టిడిపి, జనసేన, బిజెపి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రత్నగిరిపై ఘనంగా శ్రీరామనవమి

ప్రజాశక్తి - అన్నవరం



కళ్యాణోత్సవానికి హాజరైన భక్తులు, (ఇన్‌సెట్‌లో ఉత్సవమూర్తులు)

శ్రీరామనవమి పురస్కరించుకుని రత్నగిరిపై శ్రీరామనవమి కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం కొండపైన సత్యదేవుని వార్షిక కళ్యాణ వేదికపై సీతారాముల ఉత్సవ మూర్తులను ఏర్పాటు చేశారు. అనంతరం దేవస్థానం ఇఒ కె.రామ చంద్రమోహన్ సమక్షంలో దేవస్థానం అర్చకులు, వేద పండితులు సీతారాముల వారికి మంగళ వాయిద్యాలు మధ్య సంప్రదాయ రీతిలో పెళ్లి తంతు ప్రక్రియను పూర్తి చేశారు. తొలుతగా కళ్యాణోత్సవానికి ఆహ్వానం పలుకుతూ గ్రామోత్సవ సేవ నిర్వహించారు. కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు పానకం, వడపప్పు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, భజనలు భక్తులను అలరించాయి.

ఘనంగా దొరబాబు పుట్టినరోజు వేడుక



దొరబాబును గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

ప్రజాశక్తి - సామర్లకోట

వైసిపి పెద్దాపురం నియోజకవర్గ అభ్యర్థి దవులూరి దొరబాబు పుట్టినరోజు వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. స్థానిక పార్టీ కార్యాలయంలో ఉదయం నుంచి రాత్రి వరకూ నియోజక వర్గ పరిధిలోని పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు దొరబాబును కలిసి పూలమాలలతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కేకులను కోయించి దొరబాబుకు తినిపించి వేడుకలు జరిపారు. ఈ వేడుకల్లో నాయకులు దవులూరి సుబ్బారావు, ఆవాల రాజేశ్వరిలక్ష్మి, గంగిరెడ్డి అరుణ, బొడ్డు తులసి మంగతాయారు, వైస్ ఛైర్మన్‌లు ఊబా జాన్ మోసెస్, నెక్కంటి సాయిప్రసాద్‌పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పిల్లి దంపతులు

పిల్లి దంపతుల ప్రచారం

ప్రజాశక్తి - కరప

మండలంలోని పెనుగుదురు గ్రామంలో జనసేన కాకినాడ రూరల్ అభ్యర్థి పంతం నానాజీ, ఎంపీ అభ్యర్థి తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్‌లకు మద్దతుగా మాజీ ఎంఎల్‌ఎ పిల్లి అనంతలక్ష్మి, టిడిపి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి దంపతులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి పార్టీలు బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంతం సందీప్, రెడ్డిపల్లి నారాయణరావు, రెడ్డిపల్లి నారాయణరావు, తుమ్మలపల్లి మాచర్రావు, మురళి పాల్గొన్నారు.

కోడ్ వర్తించదా..?

ప్రజాశక్తి - జగ్గంపేట



ముసుగు వేయని శిలాఫలకం

ఎన్నికల కోడ్‌ను అమలు చేయడంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. మండలంలోని పలు గ్రామాల్లో ఎక్కడికక్కడే రాజకీయ నాయకుల ఫోటోలతో ఉన్న శిలఫలకాలు దర్శనం ఇస్తూనే ఉన్నాయి. రాజపూడి గ్రామంలో సుమారు రూ. 16.47 లక్షల నిధులతో నిర్మించే క్రమంలో శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. ఆ శిలాఫలకానికి ఎటువంటి ముసుగు వేయకపోవడంపై ఎన్నికల కోడ్ వీటికి వర్తించదా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

మత్స్యకారులతో వైసిపి ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న సునీల్

మండలానికి చెందిన మత్స్యకారులతో వైసిపి కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, పిఠాపురం నియోజకవర్గ అభ్యర్థి వంగా గీత ఆత్మీయ సమావేశం నిర్వహించారు. బుధవారం ఉప్పాడ గ్రామ మాజీ సర్పంచ్ ఉమ్మిడి జాన్ స్వగృహంలో జరిగిన ఈ సమావేశంలో చలమలశెట్టి సునీల్ మాట్లాడుతూ కాకినాడ పార్లమెంటు పరిధిలో ఉన్న 400 గ్రామాను దత్తత తీసుకుని ఒక్కొక్క గ్రామానికి కోటి రూపాయలు చొప్పున కేటాయించి ఎన్నికల అనంతరం అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి మాదిరెడ్డి దొరబాబు, సర్పంచులు రావి రమేష్, నక్క మణికంఠ, ఎంపిటిసి సభ్యులు మెరుగు ఎల్లాజీ,. నాయకలు సవరం లోవలక్ష్మి, కన్నయ్య, భగవాన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ అభ్యర్థి పళ్లంరాజు

కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - గొల్లప్రోలు(పిఠాపురం)

స్థానిక మార్కండేయపురంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని కాంగ్రెస్ పార్టీ కాకినాడ పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి మల్లిపూడి మంగపతి రాజు ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి మాదేపల్లి సత్యానందరావు ఆధ్వర్యంలో ఈ ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా పళ్లంరాజు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలో అప్పులు పెరిగాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలను అమలు చేశామన్నారు. కాంగ్రెస్ ప్రత్యేక హోదాకు కట్టుబడి ఉందని, రాష్ట్ర ప్రజలంతా పార్టీ అధ్యక్షురాలు షర్మిల నేతృత్వంలో బలపరిచిన పిఠాపురం అభ్యర్థి మాదేపల్లి సత్యానందరావును గెలుపించాలని కోరారు. అంతకు ముందు గొల్లప్రోలు పట్టణ ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి శ్రీనివాస్, సిపిఐ నాయకులు కేసవరపు అప్పలరాజు పాల్గొన్నారు.

యూత్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - కరప

కరప మండలం వేలంగి గ్రామంలోని గ్రాడ్యుయేట్ యూత్ కార్యాలయాన్ని గ్రామ ఉప సర్పంచ్ కుంచె అయ్యన్న ప్రారంభించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో చంద్రు తారకం, ఖండవెల్లి గుణ, మేడిశెట్టి పట్టాభి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలు నుంచి గ్రామంలోని యువకులు గ్రాడ్యుయేట్ యూత్‌గా ఏర్పడి గ్రామంలో కుల, మతాలు, పార్టీలకు అతీతంగా సమస్యలను పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమని అన్నారు ఈ కార్యక్రమంలో సానా శ్రీను, జీలకర్ర దుర్గారావు, ఎర్ర రాజు, ముడుగు కృష్ణ, వేలంగి గ్రాడ్యుయేట్స్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

దొరబాబు సతీమణి ప్రచారం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక 18 వ వార్డు పరిధిలోని పలు వీధుల్లో బుధవారం వైసిపి పెద్దాపురం అభ్యర్థి దవులూరి దొరబాబు సతీమణి చంద్రకళ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైసిపికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ ఛైర్మన్‌లు నెక్కంటి సాయిప్రసాద్, కనకాల మహాలక్ష్మి, నాయకులు సయ్యద్ జానీ, కాపుగంటి కామేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

ప్రజాశక్తి - గొల్లప్రోలు(పిఠాపురం)

రాబోయే ఎన్నికల్లో కూటమి ఎంఎల్ఎ అభ్యర్థి పవన్ కళ్యాణ్, కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగేళ్ల ఉదయ శ్రీనివాస్‌కు ఓటు వేసి గెలిపించాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు కోరారు. పట్టణంలో బుధవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మరేగులలో సత్యప్రభ పర్యటన

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని గుమ్మరేగుల గ్రామంలో ప్రత్తిపాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ బుధవారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పసగడుగుల రమణ, ఎంపిటిసి సభ్యులు సోమరౌతు రవి, టిడిపి మండల అధ్యక్షులు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

హోప్ ఐలాండ్‌లో సుబ్బరాజు ప్రచారం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి పంచాయతీ హోప్ ఐలాండ్‌లో దాట్ల సుబ్బరాజు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హోప్ ఐలాండ్ గ్రామంలో మహిళలు పడుతున్న పలు కష్టాలను సుబ్బరాజుకి వివరించారు. కూటమి ద్వారా ఏర్పాటు అయిన ప్రభుత్వం ద్వారా సమస్య లన్నీ పరిష్కరిస్తామని దాట్ల హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సభ్యులు పొన్నమండ రామలక్ష్మి, నాయకులు వాడ్రేవు వీరబాబు పాల్గొన్నారు.

భానుడి భగభగలు



ఎండ వేడిమితో వెలవెలబోతున్న సామర్లకోటలోని గాంధీ బొమ్మ సెంటర్

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట మండలం, పట్టణ పరిధిలో భానుడి భగభగలతో ఎండలు మండుతున్నాయి. అంతకంతకు పెరుగుతున్న ఎండల వేడిమితో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 8 గంటల నుంచే సూర్యుడు తన ప్రతాపం చూపుతున్నాడు. అధికంగా ఎండ వేడి, ఉక్కపోత ఉండడంతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. మరోవైపు వేడిగాలులు వీస్తుండడంతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. దీంతో ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నారు. 10 గంటల తర్వాత ప్రధాన రహదారులు, కూడళ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. మార్కెట్లు వెలవెలబోతున్నాయి. కర్ఫ్యూ విధించినట్లుగా రహదారులన్నీ కన్పిస్తున్నాయి. ఎండవేడిమికి వృత్తిదారులు తమ పనులు చేయలేకపోతున్నారు. ఉపాధి వేతనదారులు, భవన నిర్మాణ కార్మికులు, శ్రామికులు, ఫుట్‌పాత్ వ్యాపారులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా వృద్ధులు, చిన్నారులు అల్లాడిపోతున్నారు. ప్రయాణికులు, వాహనదారులు కూడా రాకపోకలు సాగించలేకపోతున్నారు. వివిధ పనుల నిమిత్తం బయటకు వచ్చేవారు సైతం ఉదయం 10 నుంచి 11 గంటల్లోపు పనులను చూసుకుని ఇంటి బాట పడుతున్నారు. ప్రస్తుతం శుభకార్యాలు అధికంగా ఉండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో మరికొందరు ప్రయాణాలు సాగిస్తున్నారు. మే నెల రాకుండానే 40 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే.. మే నెలలో పరిస్థితేమిటో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. .ఇదిలా ఉండగా వడగాల్పులు వీస్తున్నట్టు ఎపి విపత్తుల సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. ఎండ తీవ్రత జూన్ వరకు కొనసాగే అవకాశం ఉందని హెచ్చరించింది. మొబైల్ ద్వారా పలు సూచనలు చేస్తోంది. ఈ నేపథ్యంలో మరికొద్దిరోజులపాటు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితిల్లో మాత్రమే ఇంటి నుంచి బయటకు రావాలని సూచిస్తున్నారు. ఎండల వేడిమి తాళలేక బాటసారులు శీతల పానీయాలు, పలు రకాల పండ్ల జ్యూసులు, చెరుకు రసం బండ్లు, ఆశ్రయించి సేద తీరుతున్నారు. బాటసారి వేసవి దాహం తీర్చడానికి గతంలో ప్రభుత్వం కార్మిక శాఖ ద్వారా చలివేంద్రాలను ఏర్పాటు చేసేవారు. ప్రస్తుత సీజన్లో దాతలు ముందుకు వచ్చిన చోట మాత్రమే కొద్దిగా చలివేంద్రాలు ఏర్పాటు అవుతున్నాయి. ప్రభుత్వం కూడా స్పందించి ప్రధాన కోడలు విరివిగా చలివేంద్రాలు ఏర్పాటు చేసి బాటసారుల దాహార్తి తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - కాకినాడ



మే 13న జరగనున్న సాధారణ ఎన్నికలకు సంబంధించి నేటి నుంచి నామినేషన్లను స్వీకరించనున్నట్లు కాకినాడ సిటీ నియోజకవర్గ ఆర్ఒ జె.వెంకటరావు తెలిపారు. బుధవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తామని చెప్పారు. 26వ తేదీన నామినేషన్ల పరిశీలన ఉంటుందని, 29వ తేదీలోపు నామినేషన్లు ఉపసంహరణ ఉంటుందన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తా మన్నారు. నామినేషన్లు స్వీకరించే ప్రాంతానికి 100 మీటర్ల విస్తీర్ణంలో ఆంక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. అభ్యర్థితోపాటు ఐదుగురిని మాత్రమే లోపలకు అనుమతిస్తా మన్నారు. ప్రభుత్వ పనిదినాల్లో మాత్రమే నామినేషన్లు స్వీకరిస్తామని, ఫారం-2బి, ఫారం-26లో నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుందన్నారు. వేసిన నామినేషన్లు, అఫిడవిట్‌లలో ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటే 26వ తేదీ స్క్రూటినీ లోపుగా సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అలాగే అభ్యర్థులు తమ బి ఫారాలను 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటల లోపు సమర్పించాలన్నారు. పోటీ చేసే అభ్యర్థులకు స్థానికంగా ఓటు లేకపోతే ఓటు ఉన్న ప్రాంతంలోని ఆర్ఒతో ధృవీకరించిన పత్రాన్ని జత చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే 10 రూపాయలు బాండ్ పేపర్‌పై ప్రమాణ పత్రాన్ని సమర్పించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలు రూ.5వేలు, ఇతర అభ్యర్థులు రూ.10వేలు చొప్పున డిపాజిట్ సొమ్ము చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇతర సమాచారం కోసం నామినేషన్లు స్వీకరించే ప్రాంతం వద్దే హెల్ప్ డెస్క్ కూడా ఏర్పాటు చేశామన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే సదరు హెల్ప్ డెస్క్ వద్ద మరింత సమాచారాన్ని పొందవచ్చునన్నారు. డిప్యూటీ కమిషనర్ గుంటూరుశేఖర్, ఎఆర్ఒ చల్లన్నదొర, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్లు నాయుడు, సిహెచ్ అనిల్‌కుమార్, పవన్ పాల్గొన్నారు.

తోట అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి - కరప

శిరోముండనం కేసులో శిక్ష పడిన తోట త్రిమూర్తులు వైసిపి మండపేట నియోజకవర్గ అభ్యర్థిత్వాన్ని ఆ పార్టీ అధిష్టానం తక్షణమే రద్దు చేయాలని మండల అంబేద్కర్ యువజన సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం సంఘం నాయకులు ఓ ప్రకటనను విడుదల చేశారు. శిరోముండనం కేసులో ఎట్టకేలకు న్యాయస్థానం తీర్పు ఇచ్చి దేశంలో ఇంకా న్యాయం బ్రతికే ఉందని స్పష్టం చేసిందన్నారు. కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని తెలిపారు. అయితే తక్షణమే వైసిపి అధిష్టానం తోట త్రిమూర్తులు ఎంఎల్ఎ అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రకటన విడుదల చేసిన వారిలో సంఘం నాయకులు వెంకటేశ్వరరావు, పత్తిపాటి బుల్లిరాజు, సవ్య రాజేష్, మాత అప్పారావు, జెల్లా శివ కుమార్, సాదే లోహిదాస్ ఉన్నారు.

యానాంలో ముగిసిన ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - యానాం

యానాం అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం బుధవారం సాయంత్రంతో ముగిసింది. పుదుచ్చేరి లోక్ సభ స్థానానికి ఈనెల 19న పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికలకు సంబంధించి గత కొన్ని రోజులుగా బరిలో నిలిచిన ఆయా అభ్యర్థులకు మద్దతుగా యానాంలో ఆయా రాజకీయ పార్టీల నాయకులు గత కొన్ని రోజులుగా ప్రచారం నిర్వహించారు. ఎన్ఆర్.కాంగ్రెస్, బిజెపి కూటమి అభ్యర్థి నమశ్శివాయంకు మద్దతుగా ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, బిజెపి అధ్యక్షుడు రాజు తదితర నాయకులు ప్రచారం చేశారు. మరోపక్క ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి నమశ్శివాయంకు మద్దతుగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆధ్వర్యంలో తమ మద్దతుదారులు ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్, డిఎంకే కూటమి అభ్యర్థి వైథిలింగంకు మద్దతుగా ఎన్నికల ఇన్‌ఛార్జ్ మల్లాడి సత్తిబాబు, దినేష్ ఆద్వర్యంలో ప్రచారం చేశారు. అన్నా డిఎంకె పార్టీ అభ్యర్థి తమిళ్ వేందన్‌కు మద్దతుగా ఆ పార్టీ యానాం కార్యదర్శి మంచాల సత్యసాయికుమార్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు.

200 రోజులు పనిదినాలు కల్పించాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

ఉపాధి హామీ పథకంలో ప్రతీ కుటుంబానికి 200 రోజుల పనిదినాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కడితి సతీష్ డిమాండ్ చేశారు. బుధవారం జగ్గంపేటలో ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. పని ప్రాంతంలో కూలీలకు కనీస సౌకర్యాలు ఉండటం లేదన్నారు.

శరీరంలో వచ్చే మార్పులు గమనించాలి

ప్రజాశక్తి - సామర్లకోట



మాట్లాడుతున్న డాక్టర మహోన్నత్, డాక్టర్ మాధవి

కోవిడ్ అనంతరం శరీరంలో వస్తున్న మార్పులను ముందుగా గమనించి తగు ఆరోగ్య జాగ్రత్తలు చేపట్టాలని స్థానిక విజన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్వాహకులు షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ మహోన్నత్ చెప్పారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కోవిడ్ తర్వాత శరీరంలో వచ్చే మార్పులు తెలుసుకుంటూ 45 రకాల పరీక్షలు హెల్ప్ చెకప్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవా లన్నారు. ఈనెల 20వ తేదీ వరకు ఆసుపత్రిలో ఇద్దరు డాక్టర్లు పర్యవేక్షణలో హెల్త్ చెకప్‌లు జరుగుతున్నాయని చెప్పారు. రూ.5,540 విలు వగల పరీక్షలు కేవలం రూ. 2,999కే తగ్గించి నిర్వహించడం జరుగుతుందన్నారు. వీటిలో ప్రధానంగా కన్ను, గుండె, లివర్, కిడ్నీ, ఎము కలు థైరాయిడ్, ఊపిరితిత్తులు షుగర్, నీరుడు అంటు వ్యాధులు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా డాక్టర్ కన్సల్టేషన్ ఉంటుందన్నారు. అలాగే రూ.2550 విలువగల 26 రకాల డయాబెటిక్ పరీక్షలు రూ1899కే నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షలు చేయించుకునేవారు పరగడుపుతో రావాలన్నారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారికి దృష్టి ఆసుపత్రి నిపుణులు డాక్టర్ మాధురి ఉచితంగా కన్సల్టేషన్ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సామర్లకోట పరిసర ప్రాంతాల ప్రజలు వినియోగించుకోవాలని మహోన్నత్ విజ్ఞప్తి చేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే లిబరేషన్ పోటీ

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మతోన్మాద, ఫ్యాక్షన్ రాజకీయాలు నిలువరించి ప్రజాస్వామ్య పరిరక్షణకు సిపిఐ ఎంఎల్ లిబరేషన్ ఎన్నికల బరిలోకి దిగుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నైనాలశెట్టి మూర్తి అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పార్టీ తరపున కాకినాడ పార్లమెంటుకు కేంద్ర కమిటీ సభ్యులు బుగత బంగార్రాజు, ప్రత్తిపాడు అసెంబ్లీ అభ్యర్థిగా జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జున్‌రావు, తుని అభ్యర్థిగా వాడిపోయిన శివ పోటీ చేస్తున్నట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో బిజెపి, ఆర్ఎస్ఎస్ కనుసనల్లో పనిచేసే మిగిలిన పార్టీలు అధికారంలోకి వస్తే మనువాద రాజ్యాంగాన్ని తీసుకొస్తామని బాహాటంగా చెప్తున్నారన్నారు. ఈ సమావేశంలో గిరిజన సంఘం నాయకుడు రేచుకట్ల సింహాచలం, మానుకొండ లచ్చబాబు, గొడుగు సత్యనారాయణ, చిన్నబిల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మూర్తి

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి, హిమాన్షు శుక్లా

ప్రజాశక్తి-అమలాపురం

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఈనెల 18 వ తేదీ నుంచి పార్లమెంట్, అసెంబ్లీ సాధారణ ఎన్నికలు -2024 కు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా బుధవారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. అమలాపురం పార్లమెంట్ నియోజక వర్గానికి సంబంధించి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. అదేవిధంగా అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించి రిటర్నింగ్ అధికారి వారి కార్యాలయాలలో నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. జిల్లాలో కొత్తపేట, పి గన్న వరం, అమలా పురం ముమ్మిడి వరం, రాజోలు, రామచంద్రపురం, మండపేట ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలకు ఆయా రిటర్నింగ్ అధికా రుల కార్యాల యాల లోనూ, అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి కలెక్టరేట్లోని ఆర్ఒకార్యాలయం లో నామినేషన్ల స్వీకరిస్తారన్నారు. నామినేషన్ల స్వీకరణకు గెజిట్ నోటిఫికేషన్ను ఈనెల 18 న విడు దల చేస్తారన్నారు. ఈనెల 18 నుంచి 25 వరకు ప్రభుత్వ సెలవులు మినహాయించి కార్యాలయ పని వేళ్లలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఈనెల 26న నామినేషన్ల పరిశీలన ప్రక్రియ నిర్వహిస్తారన్నారు. 29 వరకు నామినేషన్ల ఉపసంహ రణకు అవకాశం అభ్యర్థులకు ఉందన్నారు. ఉపసంహరణ అనంతరం పోటీలో నిలిచిన అభ్యర్థులను తుది జాబితా ప్రకటిస్తామన్నారు. మే 12న పోలిం గ్ సిబ్బందికి ఇవిఎంలు, వివి ప్యాట్లు, స్టేషనర్ ఇతర పోలింగ్ సామగ్రి అందజేసి, ముందుగా నిర్ణయించిన రూట్ మ్యాప్ మేరకు ఆయా పోలింగ్ కేంద్రాలకు సిబ్బం దిని వాహనాల్లో తరలించనున్నట్లు ఆయన తెలిపారు. మే 13న పోలింగ్ ప్రక్రియ జరుగుతుంద న్నారు. జిల్లాలో గతంలో కన్న ఓటింగ్ శాతం పెంపే ప్రధాన లక్ష్యంగా జిల్లా యంత్రాంగం ముందుకు సాగుతోందని తెలి పారు. ఏపిక్ కార్డుతో పాటు 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి గుర్తింపుగా చూపించి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ఎన్నికల సంఘం పోలింగ్ ప్రెస్, వీడియో కవరేజ్ విధుల్లో నిమగ్నమై వుండి గుర్తిం పు పత్రాలుగల పాత్రికేయులకు కూడా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌలభ్యం కల్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఓటరు ఫెసి లిటేషన్ కేంద్రాల ఏర్పాట్లుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇస్తున్న కేంద్రాల్లో ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుం టున్నామని అన్నారు ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు విని యోగించు కునేందుకు విస్తృతంగా అవగాహన కార్య క్రమాలు చేపడు తున్నామన్నారు. రద్దీగల బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు మొదల్కెన ప్రాంతాల్లో ఓటర్ అవగాహన కార్యక్ర మాలు చేపడుతున్నామని అన్నారు. జిల్లాలో ఓటింగ్ శాతం పెంచ డమే లక్ష్యంగా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా ముమ్మరంగా నగదు, మద్యం గిఫ్ట్ ఆర్టికల్స్ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకై తనిఖీలు నిర్విస్తు న్నామ న్నారు. రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్తుంటే ఆధారాలు తప్పనిసరిగా చూపాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో చెక్ పోస్టులతోపాటు ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా ముమ్మరంగా తనిఖీ చేస్తున్నట్లు జిల్లా కలెక్టరు పేర్కొన్నారు. జిల్లాలో ప్రశాంత వాతా వరణంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించు కునేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపడు తున్నట్లు తెలిపారు.


కలెక్టర్ హిమాన్షు శుక్లా

సి-విజిల్ ఫిర్యాదులపై చర్యలు: సిపిఒ

ప్రజాశకి-అమలాపురం

త్వరలో నిర్వహించనున్న పార్లమెంట్ అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై సి-విజిల్ ద్వారా అందిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యలు ఈ విధంగా ఉన్నాయని సిపిఓ వెంకటేశ్వర్లు బుధవారం ప్రకటనలో తెలిపారు. సి విజిల్ యాప్ ద్వారా పౌరులు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనల పై అందిన ఫిర్యాదుల రోజువారి నివేదిక ప్రకారం ఈ నెల 16 వ తేదీ 2 ఫిర్యాదులు ఎన్నికల ప్రవర్తన నియమాలు ఉల్లంఘనలపై అందాయన్నారు. వాటిని 100 నిమిషాల లోపు పరిష్కరించామన్నారు సి విజిల్ యాప్ ద్వారా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వాటి నుండి ఇప్పటివరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి 416 ఫిర్యాదులు రాగా వాటిలో 88 ఫిర్యాదులు ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధిం చినవి కానివని ధ్రువీకరించామన్నారు మిగిలిన 328 ఫిర్యాదుల లో 100 నిమిషాల్లోపు 294 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. 34 ఫిర్యాదులను వంద నిమిషాలు పైబడిన తర్వాత పరిష్కరించామన్నారు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వారి ద్వారా డాక్టర్ బిఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి గత నెల 16వ తేదీ నుంచి ఈ నెల 16వ తేదీ వరకు 30 ఫిర్యాదులు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనల పై వచ్చాయన్నారు. వీటిలో 29 ఫిర్యాదులను సకాలంలో పరిష్క రించామని ఒక్క ఫిర్యాదు కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గానికి సంబం ధించి పెండింగ్లో ఉందని ఆయన తెలిపారు.

బ్రాంచ్ పోస్టాఫీసుకు త్వరలో శాశ్వత వసతి

ప్రజాశక్తి-మండపేట

ఏడిద సీతానగరం గ్రామంలోగల బ్రాంచ్ పోస్టాఫీసుకు త్వరలో శాశ్వతవసతి సౌకర్యం ఏర్పాటు చేస్తామని గ్రామ సర్పంచ్ వరదా చక్రవర్తి తెలిపారు. పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ మాజీ కార్యదర్శి టి.పుల్లేశ్వరరావు, బ్రాంచి పోస్ట్ మాస్టర్ రాజేష్ బుధవారం సర్పంచ్ చక్రవర్తి ని కలుసుకున్నారు పోస్ట్ ఆఫీస్ కు సరైన వసతి సౌకర్యం లేని విషయాన్ని సర్పంచ్ దష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందిస్తూ త్వరలో ఈ సమస్యను పరిష్కరించడానికి కషి చేస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు . గ్రామపంచాయతీ ఆధీనంలో ఉన్న ఒక మంచి భవనాన్ని పోస్ట్ ఆఫీస్ కు కేటాయిస్తానని ఈ సందర్భంగా సర్పంచ్ చక్రవర్తి తెలిపారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

ప్రజాశక్తి-ముమ్మిడివరం

రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులంతా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రబీ సీజన్ లో రైతులు పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధర కల్పించడానికి జిల్లా వ్యాప్తంగా 377 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉన్నాయని అన్నారు. వీటి ద్వారా సాధారణ రకం క్వింటాళ్ల కు రూ.2183, ఎ గ్రేడ్ రకం క్వింటాళ్లకు రూ.2303 చొప్పున మద్దతు ధరగా నిర్ణయించారని ఆయన అన్నారు. రైతులు రైతు బరోసా కేంద్రాల్లోని టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు మరియు సహాయకులను సంప్రదించాలని అన్నారు. ధాన్యం తేమ శాతాన్ని బట్టి ధర నిర్ణయించారని అన్నారు. గోనె సంచులు, హమాలీ మరియు రవాణా చార్జీలను ప్రభుత్వమే భరిస్తుందని ఆయన తెలిపారు. రైతులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే కంట్రోల్ రూమ్ నంబర్.18004252532 కి ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల లోపు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చునన్నారు. రైతులంతా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి వెంకన్న కళ్యాణోత్సవాలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు నేటి నుంచి వారం రోజుల పాటు నిర్వహించనున్నారు. నేడు గురువారం అంకుర్పారణ, ధ్వజారోహణతో కల్యాణోత్సవాలు ప్రారంభమవుతాయి. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు చైత్రశుద్ధ ఏకాదశి రోజున స్వామి వారి కల్యాణం నిర్వహిస్తారు. అదే రోజు తీర్థం, రథోత్సవం నిర్వహిస్తారు 20న పొన్న వాహనంపై స్వామివారి గ్రామోత్సవం, 21న మహదాశీర్వచనం, సదస్యం. 22న గౌతమి నదిలో తెప్పో త్సవం, 23న మహా పూర్ణాహుతి, చక్రస్నానం, ధ్వజావరోహణ, 24 శ్రీపుష్పోత్సవంతో కల్యాణోత్సవాలు ముగుస్తాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన వాయిద్య కళాకారుల ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ముఖ్య కూడళ్ల వద్ద హోర్డింగులు, అలంకరణలు చేస్తు న్నారు. ఇఒ భూపతిరాజు కిషోర్కుమార్ ఉత్సవ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కొత్తపేట ఆర్డిఒ సత్యనారాయణ రెండుసార్లు వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఆలయ ట్రస్టు బోర్డు పదవీకాలం పూర్తికావడంతో ప్రత్యేకా ధికారి పర్యవేక్షణలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనరు ఎం.విజయ రాజును ప్రత్యేకాధికారిగా నియమించారు.

భానుడి భగభగలు

బెంబేలెత్తుతున్న జనం, నిర్మానుష్యంగా రోడ్లు

ప్రజాశక్తి-రామచంద్రపురం

రోజురోజుకు ఎండలు మండుతున్నాయి. ఆరోజుకారోజు ఉష్ణోగ్రతలు పెరగడంతో ఎండల వేడిమీ తట్టుకోలేక సామాన్యులు విలవిలాడుతున్నారు. ఉపాధి కూలీలు సైతం మండే ఎండల్లో పని చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఇక మధ్యాహ్నం 12 గంటల నుంచి మెయిన్ రోడ్లన్నీ కర్ఫ్యూ వాతావరణం తలపిస్తూ నిర్మానుష్యంగా తయారయ్యాయి. సిమెంట్ రోడ్లు పెరిగిపోవడం, ఇష్టాను రీతిగా చెట్లను నరికి వేయడంతో భూ వాతావరణంలో వేడిమి తిరిగి పెద్ద మొత్తంలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ ఏడాది మే లో 50 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రమాదం పొంచి ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ఇప్పటి నుంచే 40 డిగ్రీలు పైగా ఉష్ణోగ్రతల నమోదవుతూ సామాన్యులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు మరింత పెరిగితే పసిపిల్లలు వద్దులు మరింత ఇక్కట్లకు గురయ్యే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వేసవి మధ్యాహ్నం ప్రయాణాలు చేయవద్దని, మంచినీరు మజ్జిగ వంటి పానీయాలను అధికంగా సేవించాలని వైద్యులు తెలుపుతున్నారు.


ఎండలకు తట్టుకోలేక నీడను చేరిన ఉపాధి కూలీలు


మధ్యాహ్నం 12 గంటలకు ద్రాక్షారామం మెయిన్ సెంటర్



పుత్రసత్యశర్మను సత్కరిస్తున్నఉపాధ్యాయ సంఘ నాయకులు

ఘనంగా ఎపిటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-మండపేట

ఎపి టీచర్స్ ఫెడరేషన్ ఏర్పడి 10 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఫెడరేషన్ ఏర్పాటు చేసిన మండలం లోని తాపేశ్వరం గ్రామంలో ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షులు జి.హదయ రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ వ్యవస్థాపకులు మారెళ్లపూడి పుత్ర సత్య శర్మ మనువడు పుత్రసత్యశర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల జీవన ప్రమాణలను మెరుగు పరచేందుకు అప్పట్లో ఈ సంఘం ఏర్పాటు చేశారన్నారు. నేడు ఈ సంఘాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే విద్యారంగంలో అసమానతలను తొలగించేందుకు కషి చేయాలన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి చిరంజీవి మాట్లాడుతూ త్వరలో రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక మహాసభలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం పుత్రసత్యశర్మ ను ఘనంగా సత్కరించి మెమెంటోను అందజేశారు. ఉపాధ్యాయ ప్రగతి ప్రధాన సంపాదకుడు జి. సత్యనారాయణ ఐఫియా నాయకులు కె.సుబ్బారెడ్డి, ఎ. సదాశివరావు, రామారావు, లక్ష్మణరావు, కెవివి సత్యనారాయణ, ఉదయ బ్రహ్మం కనుపూరి సుబ్బారావు, కనుపూరి కష్ణమూర్తి, రాష్ట్ర నలుమూలల నుండి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుంగనూరు పేయి దూడ జననం

ప్రజాశక్తి-ఆలమూరు

జొన్నాడకు చెందిన రైతు ఆనెం వెంకన్న కమతంలో ఉన్న దేశవాళీ పుంగనూరు ఆవుకు బుధవారం అరుదైన సంతతికి చెందిన పెయ్యి దూడ జని మ్మంచింది. పుంగ నూరు దూడను ఆశక్తిగా పలువురు రైతులు తిలకిస్తున్నారు. రైతు వెంకన్న మాట్లాడుతూ పుంగనూరు జాతి పశుసంతతిపై ఉండే మక్కువతో పెంచుతున్నట్లు రైతు తెలిపారు. ఈ ఏడాది కాలంలో రెండు ఆవులకు రెండు పుంగనూరు పెయ్యిదూడలు, ఒక గిత్త దూడ జన్మించినట్లు రైతు తెలిపారు. దీనిపై స్థానిక పశు వైద్యులు వినోద్ కుమార్ మాట్లాడుతూ రైతు వెంకన్న కమతంలో ఈ అరుదైన జాతి దూడలు జన్మించి ఆరోగ్యవంతంగా ఉన్నాయని తెలిపారు.


పుంగనూరు దూడతో రైతు వెంకన్న

ఘనంగా అన్నపూర్ణ పుట్టినరోజు

ప్రజాశక్తి-అయినవిల్లిరూరల్

అయినవిల్లి మండలం మాజీ జెడ్పిటిసి సభ్యురాలు గంగుమళ్ళ కాశీ అన్నపూర్ణ పుట్టినరోజు వేడుక బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక విలస గ్రామంలో మన్నా మినిస్ట్రీస్ న్యూ లైఫ్ సెంటర్(కుష్ఠు మరియు ఎయిడ్స్ రోగుల పునరావాస కేంద్రం)లో జియంసి బాలయోగి చారిటబుల్ సొసైటీ(1999)ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కన్వీనర్ అక్కిశెట్టి దుర్గారావు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎంఎల్ఎ అయ్యాజీ మేమా మాట్లాడుతూ నేటి యువత సేవలో సేవా కార్యక్రమాల్లో మన ప్రాంతంలో అన్నపూర్ణ, శ్రీనివాస్ దంపతులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. 26 సంవత్సరాల సుదీర్ఘ కాలం పాటు సొంత ఖర్చులతో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. అనంతరం బాధితులకు బ్రెడ్లు, పండ్లు, వస్త్రాలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పి.గన్నవరం జనసేన పార్టీ సమన్వయకర్త మద్దా చంటిబాబు, బిజెపి ఉపాధ్యక్షులు గనిశెట్టి వెంకటేశ్వరరావు, దళిత నాయకులు గిడ్ల వెంకటేశ్వరరావు, రిటైర్డ్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి మరియు అన్నా మినిస్ట్రీస్ అధినేత ఐ.ఇ కుమార్, అయినవిల్లి ఉప సర్పంచ్ పోలిశెట్టి రాజేస్ తదితరులు పాల్గొన్నారు.

తోటను అన్ని పార్టీలు బహిష్కరించాలి

ప్రజాశక్తి -మామిడికుదురు

దళిత ద్రోహి తోట త్రిమూర్తులను అన్నీ రాజకీయ పార్టీలు బహిష్కరించాలని దళిత చైతన్య వేదిక సమన్వయకర్త బత్తుల జనార్ధనరావు పిలుపునిచ్చారు. నగరంలోని భారత్‌నగర్‌లో బుధవారం బత్తుల ఆధ్వర్యంలో దళిత నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. తోట త్రిమూర్తులకు జైలు శిక్ష విధించడంపై హర్షం వ్యక్తం చేశారు. 28 ఏళ్లపాటు దళిత, ప్రజా సంఘాలు చేసిన పోరాటం వల్లే త్రిమూర్తులకు శిక్ష పడిందన్నారు. తోట త్రిమూర్తులను పదవి నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అబ్రహాం, బత్తుల రామకృష్ణ, యాలంగి శేషగిరిరావు, బత్తుల శ్యాంబాబు, కోట పుల్లయ్య, యాలంగి జాన్, బత్తుల విజయ్, బత్తుల త్రిమూర్తులు, బత్తుల శ్రీను, బత్తుల వినోద్, పల్లి శివాజీ, కె.నాగరాజు, బద్దె దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యాన రక్తదానం

ప్రజాశక్తి-గోపాలపురం

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే ధ్యేయంగా దొండపూడి హెల్పింగ్ హాండ్స్ సభ్యులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని మానవత సంస్థ తాళ్లపూడి చైర్మన్ సింహాద్రి జనార్దన్ రావు, మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు గోకవరపు బాబు కొనియాడారు. మంగళవారం దొండపూడి గ్రామంలో హెల్పింగ్ హాండ్స్ 5వ వార్షికోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో రక్తదానం చేశారు. ఉచిత కంటి వైద్య శిబిరం, ఐ డొనేషన్ క్యాంప్ నిర్వహించారు. అనంతరం జనార్ధనరావు, బాబులు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు హెల్పింగ్ హాండ్స్ సభ్యులు చేస్తున్న సేవలను ప్రశంసించారు. ఇలా గ్రామ గ్రామానా గ్రూపులుగా ఏర్పడి మంచి కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. దొండపూడి పరిసర ప్రాంతాల ప్రజలకు ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో హెల్పింగ్ హాండ్స్ సభ్యులు చేస్తున్న సేవా కార్యక్రమాలు రానున్న రోజుల్లో మరింత మందికి అండగా నిలబడాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో పోతిరెడ్డి నాగరాజు, ముత్యాల రాయుడు పోతిరెడ్డి పెదబాబు, పోలినాటి సురేష్ బాబు, బొమ్మ మురళి, మద్దాల సనారీ, వెన్నా వెంకట్రావు, మద్దాల నాగేశ్వరరావు, షేక్ వలీ మాస్టర్, మారాజు రాజేష్, నున్నా అనంత మణికుమార్, వెల్లంకి జయశివసూర్యం, కొమ్మన ప్రసాద్, పిల్లి వెంకటేశ్వరరావు, మద్దు రమాకాంత్, నగరగంటి వాసు, మల్లిపూడి శ్రీను, షేక్ మస్తాన్, షేక్ సుబాన్, షేక్ హుస్సేన్, కడియం శ్రీను పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయాల్లో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్, కొవ్వూరు రూరల్, గోపాలపురం

ఎన్నికల్లో పోలింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లుగా నియమితులైన వారి పోస్టల్ బ్యాలెట్ ఓట్లను వినియోగించేందుకు రాజమహేంద్రవరం రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ఫారం-12 సేకరణ కేంద్రం ఏర్పాటు చేసినట్లు రాజమండ్రి రూరల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధులను కేటాయించిన ఇతర పోలింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్స్ ఫారం-12 భర్తీ చేసి, ఎన్నికల ఉత్తర్వుల కాపీ జిరాక్స్, ఆధార్ కార్డ్ జిరాక్స్, ఓటరు గుర్తింపు కార్డు జిరాక్స్, రెండూ తాజా పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు ఏప్రియల్ 22 లోగా అందజేయాలని జెసి తేజ్ భరత్ తెలిపారు. కొవ్వూరు రూరల్ ఎన్నికల విధులు నిర్వహించే వారు పోస్టల్ బ్యాలెట్ ఓట్లను వినియోగించేందుకు కొవ్వూరు నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయాల్లో, కొవ్వూరు మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ఫారం-12 సేకరణ కేంద్రం ఏర్పాటు చేసినట్లు కొవ్వూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి తహశీల్దార్ కార్యాలయాలలో, కొవ్వూరు మున్సిపల్ కార్యాలయంలో, కొవ్వూరు (ఎస్‌సి) నియోజకవర్గంలో ఓటు హక్కు ఉన్న మైక్రో అబ్జర్వర్, ఒపిఒలు ఫారం 12ను భర్తీ చేసి, ఎన్నికల ఉత్తర్వుల కాపీ జిరాక్స్, ఆధార్ కార్డ్ జిరాక్స్, ఓటరు గుర్తింపు కార్డు జిరాక్స్, రెండూ తాజా పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు ఏప్రియల్ 22 లోగా అందచేయాలని అశుతోష్ శ్రీవాత్సవ్ తెలిపారు. గోపాలపురం పోస్టల్ బ్యాలెట్ ఓట్లను వినియోగించేందుకు గోపాలపురం నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయాల్లో ఏర్పాట్లు చేసినట్లు గోపాలపురం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కెఎల్.శివజ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అప్పులతోనే కుటుంబ పోషణ

అవస్థల్లో 'ఉపాధి' కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది

రెండు నెలలుగా అందని వేతనాలు

పని దినాలపై టార్గెట్లతో అధికారుల ఒత్తిడి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

గత పదేళ్లలో ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. ప్రభుత్వ విధానాల వలన చార్జీల భారం పెరిగింది. ఇటీవల కరెంట్ బిల్లులు ఎక్కువగా వస్తున్నాయి. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇంటి అద్దెలు, నిత్యావసర సరుకుల ధరలు, పిల్లల ఫీజులు భారీగా పెరిగాయి. గత 18 ఏళ్లుగా కనీస వేతనాలు లేకపోయినా పని చేస్తున్నాం. ఇచ్చే అరకొర జీతాలు సకాలంలో ఇవ్వడం లేదు. రెండు నెలలుగా పెండింగ్లో ఉన్నాయి. ఎలా బ్రతకాలి. అప్పులు కూడా పుట్టడం లేదని ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ)లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 50 మంది ఏపీవోలు, 20 మంది ఇంజనీరింగ్ కన్సల్టెన్స్ (ఈసీ), 20 మంది జూనియర్ ఇంజనీర్లు (జేఈ), 160 మంది టెక్నికల్ అసిస్టెంట్స్ (టీఏ), 130 మంది కంప్యూటర్ ఆపరేటర్లు(సీవో), సుమారు 1100 మంది ఫీల్డ్ అసిస్టెంట్స్ (ఎఫ్ఏ) లు గత 18 ఏళ్లుగా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో అంకితభావంతో పని చేస్తున్నారు. గ్రామాల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి పనుల గుర్తింపు, అడిగిన వారందరికీ పని కల్పించడం, ప్రతి కుటుంబానికి 100 రోజుల పని ఇవ్వడం,మస్తర్ల నమోదు పర్యవేక్షణ, సకాలంలో వేతనాలు మంజూరు చేయించడం వంటి విషయాలలో వీరు పాత్ర వహిస్తారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జిల్లాలో సుమారు 6.92 లక్షల జాబ్ కార్డులుండగా 48 వేల శ్రమ శక్తి సంఘాలున్నాయి.

పెండింగ్ లో వేతనాలు

దాదాపు 18 ఏళ్లుగా పనిచేస్తున్న వీరందరికీ కనీస వేతనాలు అదడం లేదు. ప్రభుత్వపరంగా కల్పించాల్సిన సౌకర్యాలు లేవు. చాలీచాలని జీతాలతో కాలం వెళ్ల దీస్తున్నారు. పెరిగిన ధరలతో పోల్చుకుంటే కుటుంబ నిర్వహణ కష్టంగా మారిందని ఉద్యోగులు వాపోతున్నారు. ఎప్పటికైనా ప్రభుత్వం తమను గుర్తించి, కనీస వేతనాలు ఇస్తుందని, సౌకర్యాలు కల్పిస్తుందని ఎదురు చూస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం రెండు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. మూడో నెల కూడా ఇచ్చే అవకాశం కనిపించడం లేదు.పూట గడవని పరిస్థితుల్లో అప్పులు చేసే కుటుంబాలను పోషించుకునే దుస్థితి నెలకొందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయం కావడంతో టార్గెట్లు పెట్టి సెలవు దినాల్లో కూడా రాత్రులు, పగలు పనిచేస్తున్నా తమ వేతనాలు సకాలంలో విడుదల అయ్యేలా ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు సిబ్బంది వాపోతున్నారు. పని ఒత్తిడి పెరిగిందని మొరపెట్టుకుంటున్న పట్టించుకోవడం లేదన్నారు. వేతనాల విషయమై అధికారులను అడుగుతుంటే ఎన్నికల సమయం కాబట్టి ఎవరూ నోరు మెదపడానికి వీలు లేదంటూ సర్క్యులర్ సైతం విడుదల చేశారని చెబుతున్నారు. గత నెల 27న జరిగిన జిల్లా పరిషత్తు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సమావేశంలో వేతనాల గురించి ప్రశ్నించగా రూ.120 కోట్లు నిధులు సిద్ధంగా ఉన్నాయని, ఈనెల మొదటి వారంలో జమవుతాయని చెప్పినప్పటికీ నేటికీ జీతాలు అందని పరిస్థితి ఏర్పడిందన్నారు.

క్రమబద్ధీకరణ లేదు.

రాష్ట్రంలోని పలు శాఖల్లోని సుమారు 11 వేల కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది విధులను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో తమ విధులను కూడా క్రమబద్ధీకరించాలని ఉపాధి సిబ్బంది కోరుతున్నారు. జిల్లా ఎంపిక కమిటీ (డిఎస్సి) ద్వారా వచ్చి, క్రమబద్ధీకరణకై గతంలో సుప్రీం కోర్టు తీర్పునకు లోబడే తమకు తగిన అర్హతలను ఉన్నాయని చెబుతున్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ పాయింట్ల ఆధారంగా కూడా వీరి నియామకం జరిగింది. ఈ నేపథ్యంలో అందరికీ 2010 పీఆర్సీ ప్రకారం గ్రేడ్స్ ఫిక్స్ చేయాలని, అలవెన్స్ లను బేసిక్ పేలో కలపాలని, పీఆర్సీ 2022 ను అమలు చేయాలని, పదోన్నతులు కల్పించి,నగదు రహిత హెల్త్ కార్డులు జారీ చేయాలని, గ్రాడ్యుటీ అమలు చేయాలనే తదితర సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

'తోట'కు విధించిన శిక్ష చాలదు

ప్రజాశక్తి - అమలాపురం

శిరోముండనం కేసులో తోట త్రిమూర్తులకు విధించిన శిక్ష చాలదని, కనీసం ఏడేళ్లయిన శిక్ష వేయాలని సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు అన్నారు. కోర్టు విధించిన శిక్ష పట్ల సిపిఎం అసంతృప్తి వ్యక్తం చేసింది. 28 ఏళ్ల క్రితం సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునే విధంగా జరిగిన ఈ అనాగరికమైన దాడిపై ఎస్‌సి, ఎస్‌టి ప్రత్యేక కోర్టులోనే తీర్పు ఇంత ఆలస్యంగా వచ్చిందంటే ఇక దళితుల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. కనీసం ఆలస్యమైనా పూర్తిస్థాయి న్యాయం జరగకపోవడం విచారకరమన్నారు. ఈ కేసులో దళితులకు న్యాయం జరిపించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వం దీనిపై ఇప్పటికైనా అప్పీళ్లకు వెళ్లి కఠిన శిక్ష ఖరారయ్యే విధంగా ప్రయత్నం చేయాలని కోరారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని దళితులపై జరుగుతున్న దుర్మార్గమైన కులదురంకార ఆకృత్యాలను ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. ఇటువంటి అకత్యాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కానీ ఇందుకు భిన్నంగా చట్ట విరుద్ధంగా ఇలాంటి ఘటనలో ప్రభుత్వం, పోలీసు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందు వల్లనే దళితులకు సరైన న్యాయం దక్కట్లేదన్నారు. ఎంఎల్‌సి అనంతబాబు ఒక దళితుడిని హత్య చేసి దర్జాగా బెయిల్‌పై తిరగడమే కాకుండా ఎన్నికల్లో ప్రత్యర్థులను బెదిరించటం, అక్రమాలు చేయటం, అధికార దుర్వినియోగానికి పాల్పడటం చూస్తున్నామన్నారు. దళిత ఉద్ధరణ గురించి మాటలు చెప్పడం కాకుండా చేతల్లో చట్టాలను సక్రమంగా అమలు చేయాలన్నారు. 28 ఏళ్ల పాటు పోరాడిన వెంకటాయపాలెం దళితులకు సిపిఎం అభినంధనలు తెలుపుతుందన్నారు.



హర్షం వ్యక్తం చేస్తున్న దళిత, ప్రజాసంఘాల నాయకులు

త్రిమూర్తులకు శిక్షపై హర్షం

ప్రజాశక్తి-అమలాపురం

శిరోముండనం కేసులో నిందితుడు ఎంఎల్‌సి తోట త్రిమూర్తులుకు శిక్ష పడటం పట్ల భారత రిపబ్లిక్ పార్టీ ఆధ్వర్యంలో దళిత, ప్రజా, పిడిఎస్‌యు విద్యార్థి సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం అమలాపురం గడియార స్తంభం సెంటర్లో ప్రదర్శన నిర్వహించారు. శిరోమండనం బాధితులకు పూర్తిస్థాయి న్యాయం జరిగే పోరాడుతామని, తోట త్రిమూర్తులు పదవిని రద్దు చేయాలని, ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత వేటు వేయాలని నినదించారు. బాధితులకు నష్టపరిహారం అందించి, ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా భారత రిపబ్లికాన్ పార్టీ జాతీయ కార్యదర్శి డి.బి.లోక్ మాట్లాడారు. ఈ తీర్పు వల్ల బాధితులకు పూర్తిస్థాయి న్యాయం జరుగలేదన్నారు. శిక్ష పడిన వెంటనే బెయిల్‌పై రావడం విడ్డూరమన్నారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు నష్టపరహారం అందించి ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని అదే క్రమంలో నిందితుడికి కఠిన శిక్ష విధించే విధంగా కేసును ఉన్నత న్యాయస్థానానికి తీసుకువెళ్లాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు దళిత హక్కుల పోరాట సమితి నాయకులు ఊటాల వెంకటేష్ ,మోకా శ్రీను, ఆర్‌పిఐ నాయకులు ఇవివి.సత్యనారాయణ, కాశి రాంబోధి, రొక్కాల సత్యనారాయణ, బామ్‌సెఫ్ నాయకులు పెట్ట శ్రీను, పాలమూరు వెంకటరెడ్డి, పెయ్యల దుర్గాప్రసాద్, అయితా బత్తుల రత్నం, చిల్లి సత్యనారాయణ, గుమ్మడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌సిలు తోట, అనంతబాబులను రీకాల్ చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రాజేష్

శిరోముండనం కేసులో ముద్దాయి ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, దళితుని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఎంఎల్‌సి అనంతబాబులను రీకాల్ చేయాలని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సరిపెల్ల రాజేష్ డిమాండ్ చేశారు. బుధవారం కాకినాడలోని టిడిపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం దళితులపై దాడులు చేసిన వారికి పదోన్నతులు కల్పించి వారిని కాపాడుతుందన్నారు. శిరోముండనం కేసులో 28 ఏళ్లపాటు పోరాడిన బాధితులకు అభినందనలు తెలిపారు. శిరోముండనం కేసులో తీర్పు ఇవ్వడమే కాకుండా బెయిల్ ఇవ్వడం ఆవేదనకు గురిచేసిందన్నారు. చట్టంలో ఉన్న లోసుగులను ఆసరాగా చేసుకొని ఆయన బెయిల్ పొందారన్నారు. ఎన్నో ప్రలోభాలకు గురిచేసినా లొంగకుండా బాధితులు చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. కేసులో దళితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగలేదన్నారు. ఈ కేసు విషయంపై దళిత మంత్రులు, ఎంపీలు, ఎంఎల్ఎలు నోరుమెదపకపోవడం శోచనీయమన్నారు. దళితురాలైన హోం మంత్రి వనిత సైతం మాట్లాడకపోవడం దారుణమన్నారు. ఎంఎల్‌సి అనంతబాబు దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యంను హత్య చేసి డోర్ డెలివరీ చేశారన్నారు. కరోనా కాలంలో మాస్కులు అడిగిన డాక్టర్ సుధాకర్‌ను పిచ్చోడిని చేసి చనిపోయేలా చేశారన్నారు. రాజానగరంలో దళిత యువకుడు ప్రసాద్‌కు ఎంఎల్ఎ జక్కంపూడి రాజా గుండు కొట్టించినా ఎలాంటి చర్యలూ లేవన్నారు. తక్షణమే ఎంఎల్‌సిలుగా ఉన్న తోట త్రిమూర్తులు, అనంతబాబులను రీ కాల్ చేసి పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టిడిపి ఎస్‌సి సెల్ నాయకులు చాపల ప్రశాంతి, కొల్లాబత్తుల అప్పారావు, పలివెల రవి, బంగారు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.